


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక


శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.

కర్నూలు సంపుటి : 03, సంచిక : 283 ఛీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ సోమవారం -22- జూన్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,

## భారత్‌పై విషం చిమ్మిన పాక్




ఢిల్లీ: భారతలోని ముస్లిం ప్రార్థనా స్థలాలకు ముప్పు పొంచి ఉందంటూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఘాటుగా బదులిచ్చింది. జర్దారీ వ్యాఖ్యలు అత్యంత ద్వేషంతో రాజకీయ దురుద్దేశంతో కూడినవని విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. భారతదేశ అంతర్గత వ్యవహారాల గురించి మాట్లాడే హక్కు ఇస్లామాబాద్‌కు ఎంతమాత్రం లేదని మరోసారి స్పష్టం చేసింది. ఇటీవల పాకిస్థాన్ అధ్యక్షుడు భారత్‌పై విషం చిమ్మారు. మిగతా.. 2లో

## 'అయోధ్య' విరాళాల్లో గోల్‌మాల్: 'సిట్'కు షాకిచ్చిన ఫుటేజ్!


2లో

అయోధ్య: అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సీట్) విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!



2లో

- ముంబైలో విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ కేసులు
- రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల
- తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు
- యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

## "బీజేపీ ఎన్నికల అధికారులతో కుమ్మక్కయ్యింది"

- తన సీటు కోసం ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదు
- లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుంది
- ఎన్నికల కమిషన్ పూర్తిగా కాంప్రమైజ్ అయింది
- కాబట్టే నామినేషన్ తిరస్కరణకు గురైంది




హైదరాబాద్: రాష్ట్రం నుంచి తన కోసం రాజ్యసభ సీటు కేటాయిస్తానంటే తాను ఎట్టిపరిస్థితుల్లో ఒ?ప్పుకోనని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. మిగతా.. 2లో

## కోల్‌కతాలో మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ

- ఒకేసారి మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ.. రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు
- దూనగిరి, సంశోధక్, అగ్రే నౌకలతో పెరగనున్న నావికాదళ సామర్థ్యం
- రక్షణ రంగంలో భారత్ కొనుగోలుదారుగా ఉండబోదని స్పష్టం చేసిన ప్రధాని
- సముద్ర శక్తి బలంగా ఉన్న దేశమే ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ఎదుగుతుందని వ్యాఖ్య
- యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక సామర్థ్యాలను పెంచనున్న కొత్త నౌకలు


2లో

ఢిల్లీ: భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే' లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ




సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని,

## నీట్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని... ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!

### నీట్ విద్యార్థుల కోసం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయిన ప్రధాని మోదీ

- దేశవ్యాప్తంగా నీట్ రీ ఎగ్జామ్
- ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం
- పరీక్ష ప్రారంభమయ్యాకే తన నివాసానికి బయలుదేరిన వైనం
- దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా హాజరవుతున్న నీట్ రీ-ఎగ్జామ్
- భయం లేకుండా పరీక్ష రాయాలని విద్యార్థులకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సూచన


2

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

## కర్ణాటక రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్..


2

బెంగళూరు: కర్ణాటకలో ఇటీవల జరిగిన ఏడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా బీజేపీ-జేడీఎస్ కూటమిలో క్రాస్ ఓటింగ్ ఆరోపణలు రెండు పార్టీల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను బయటపెట్టినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీంతో, కర్ణాటక రాజకీయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కాగా, 2023 సెప్టెంబర్‌లో అధికారికంగా ఎన్డీయేలో చేరిన జేడీఎస్, బీజేపీతో కలిసి కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

## ప్రపంచానికి యోగా ఓ వరం


2లో

విశాఖపట్నం,: ప్రపంచానికి యోగా ఒక వరం లాంటిదని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అభివర్ణించారు. ఆదివారం యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు అంతర్జాతీయ యోగ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. జీవనశైలిలో యోగా ఒక భాగం కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకున్నామని వివరించారు. ప్రతి మనిషికి దినచర్యలో యోగా ఓ భాగం కావాలని ఆకాంక్షించారు. గ్రామ, మండల స్థాయిలో

# యోగా నాకు చాలా ఇచ్చింది


### - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్
- తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి
- యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు



అమరావతి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. మిగతా.. 2లో

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు.. రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు



- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏపీ సీఎం చంద్రబాబు
- 25 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు నిరంతర సేవలు
- ఎన్టీఆర్ ఆశయాలను ఛైర్మన్‌గా కొనసాగిస్తున్న బాలకృష్ణ
- పేదలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం

అమరావతి: క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. మిగతా.. 2లో

## 'రైతులపై బాబు ప్రేమ బూటకం- మోసం.. నిజం'



తాడేపల్లి: రైతులను మోసం చేస్తున్న చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై చంద్రబాబు ప్రేమ బూటకం-మోసం నిజం అంటూ ట్వీట్ చేశారు. "చంద్రబాబూ.. రైతులను మోసం చేయడంలో మీ రికార్డులను మీరే బద్దలు కొడుతున్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అయినా, మేనిఫెస్టోలో మీరు ఇచ్చిన 143 హామీలు అయినా, అన్నీ మోసాలే" అంటూ ఎక్స్ వేదికగా నిలదీశారు. "మా ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు 53.58 లక్షల రైతు కుటుంబాలకు క్రమం తప్పకుండా రైతు భరోసా అందించింది. ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా, కరోనా వచ్చినా, ఒక్క సంవత్సరం కూడా తప్పలేదు. పైగా మేము మేనిఫెస్టోలో మిగతా.. 2లో

# భారత్‌పై విషం చిమ్మిన పాక్

మొదటి పేజి తరువాయి

ఇటీవల పాకిస్థాన్ అధ్యక్షుడు భారత్‌పై విషం చిమ్మారు. ఎక్స్ వేదికగా భారత్‌ను విమర్శిస్తూ "భారతదేశంలోని వారణాసిలో ఉన్న 1000 ఏళ్ల నాటి 'మసీదు గంజ్ షహీదా'తో సహా చారిత్రక ముస్లిం మతపరమైన కట్టడాల కూల్చివేతలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఇటువంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలి, ఇలాంటి చర్యలు కొనసాగితే, అవి భారతదేశ విచ్ఛిన్నానికి నిరంతర అశాంతికి దారితీసే ప్రమాదం ఉంది" అని ఎక్స్ వేదికగా విమర్శించారు. తాజాగా దీనికి భారత్ తీవ్రస్థాయిలో బదులిచ్చింది. భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయమై మాట్లాడుతూ... "పాకిస్థాన్ అధ్యక్షుడు చేసిన నిరాధారమైన వ్యాఖ్యలను భారతదేశం ఖచ్చితంగా తిరస్కరిస్తోంది. భారతదేశ అంతర్గత విషయాలపై వ్యాఖ్యానించడానికి అతనికి ఎలాంటి హక్కు లేదు. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన పాకిస్థాన్ స్వంత మానవ హక్కుల రికార్డును గమనిస్తే, ఆ దేశ అధ్యక్షుడి వ్యాఖ్యలు మరీ హాస్యాస్పదంగా అనిపిస్తాయి. వివిధ మతాలకు చెందిన మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని, వారిని వేధించడంలో పాకిస్థాన్‌కు ఉన్న సుదీర్ఘమైన, దురదృష్టకరమైన చరిత్ర ప్రపంచమంతటికీ తెలిసిందే" అని స్పష్టం చేశారు. అయితే పాకిస్థాన్‌లో హిందువులపై జరిగే దాడులు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇదే విషయమై అక్కడి స్వచ్ఛంద సంస్థలు, ఇతర అంతర్జాతీయ పర్యవేక్షక సంస్థలు కూడా ఆ దేశంలో మతపరమైన హింసపై నిరంతరం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా హిందువులు, ఇతర మైనారిటీ వర్గాలపై అక్కడ నిరంతరం దాడులు జరుగుతున్నాయని మానవ హక్కుల సంఘాలు పేర్కొంటున్నాయి.

రాజకీయ ప్రేరేపిత దాడి

జర్దారీ వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, ఆ దేశంలో కొనసాగుతున్న మతోన్మాదం, ద్వేషపూరిత విధానాల నుంచే ఇవి పుట్టుకొచ్చాయని జైస్వాల్ ముగించారు. "ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే, పాకిస్థాన్ అధ్యక్షుడి వ్యాఖ్యలు కేవలం ఆ దేశ జాతీయ విధానాలైన మతోన్మాదం, ద్వేషం ఆధారంగా చేసిన ఒక ఉద్దేశపూర్వక రాజకీయ దాడిగా మాత్రమే పరిగణించవచ్చు" అని ఆయన అన్నారు. వారణాసిలోని చారిత్రాత్మక 'మస్జిద్ గంజ్ షహీదా'తో పాటు భారతదేశంలోని ఇతర ముస్లిం ప్రార్థనా స్థలాల కూల్చివేతకు ముప్పు ఉందంటూ జర్దారీ సామాజిక మాధ్యమం ఎక్స్ లో చేసిన పోస్ట్‌కు సమాధానంగా భారత్ ఈ ఘాటు స్పందన ఇచ్చింది. భారతదేశ అంతర్గత విషయాల్లో ఇస్లామాబాద్ జోక్యం చేసుకోకూడదని న్యూఢిల్లీ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది.

## 'అయోధ్య' విరాళాల్లో గోల్‌మాల్: 'సిట్'కు షాకిచ్చిన ఫుటేజ్!

మొదటి పేజి తరువాయి

సీసీటీవీ ఫుటేజ్ ట్యాంపరింగ్

గడిచిన ఆరు రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాలను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.

ట్రస్ట్ పెద్దలపై అనుమానాలు

ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగులను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది.

ఆలయ ట్రస్ట్‌లో భారీ మార్పులకు సిట్ సిఫార్సులు

ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు సమాచారం.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!

ఢిల్లీ: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ (Hచీ1), ఇన్ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## "బీజేపీ ఎన్నికల అధికారులతో కుమ్మక్కయ్యింది"

మొదటి పేజి తరువాయి

తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళనని అక్కడి నుండి సీటు కేటాయించాలని తెలిపారు. తన సీటు కోసం ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదన్నారు. మధ్య ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అవకాశం లేదని బీజేపీకి అర్థమైందని అందుకే ఎన్నికల అధికారులతో కుమ్మక్కు అయ్యిందని ఆరోపించారు. నత్వానీ కి ఇచ్చిన అవకాశం తనకు ఎందుకు ఇవ్వలేదని? 2023 రూల్ బుక్ అడ్డం పెట్టుకొని నత్వాని కి నామినేషన్ కరెక్షన్ కోసం 24 గంటలు ఇచ్చారని తనకు మాత్రం 2026 రూల్ బుక్ ప్రకారం నామినేషన్ కరెక్షన్ కోసం ఆ అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తనకు సంబంధం లేని కేసు వల్ల నా నామినేషన్ తిరస్కరించారు. ప్రైవేట్ వ్యక్తి ఇచ్చిన కేసులో నాకు లీగల్ నోటీస్ వచ్చింది. లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. నామినేషన్ పత్రంలో లీగల్ నోటీస్ అనే కాలమ్ లేనే లేదన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ స్థానం గెలవాలంటే 58 మంది మాత్రమే అవసరం ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలిచే సీటని బీజేపీకి తెలుసు అయినప్పటికీ కుట్రలో భాగంగానే నామినేషన్ వేశారన్నారు. తన కేసుల అంశాన్ని కాంగ్రెస్ నాయకులు ఇచ్చారనేది పచ్చి అబద్ధం బీజేపీ కావాలనే అబద్ధాలను సృష్టించింది. తానెప్పుడూ బాధితుల పక్షమేనని, శ్రీలతకు కూడా నేను అండగా ఉన్నానని తెలిపారు.రాజ్యసభ నామినేషన్ కేవలం కేసు ఉన్నంత మాత్రానా తిరస్కరణ కాలేదని, బీజేపీ,ఎన్నికల కమిషన్ పూర్తిగా కాంప్రమైజ్ అయింది కాబట్టే నామినేషన్ తిరస్కరణకు గురైందని తెలిపారు.కేవలం ఇది ఒక్క సీటుకు సంబంధించిన విషయం కాదని ఒకే దేశం ఒకే ఎన్నిక చేయాలని బీజేపీ చేస్తోందన్నారు.

## నీట్ విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని...
## ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీ గంట సేపు వెయిటింగ్!

మొదటి పేజి తరువాయి



ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా తన అధికారిక నివాసానికి వెళ్లాల్సి ఉంది. అయితే, మధ్యాహ్నం 2 గంటలకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభం కానుండటంతో, తన కాన్వాయ్ కారణంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు ఇబ్బంది పడతారని ప్రధాని భావించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ఆయన విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత, అంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఆయన తన నివాసానికి బయలుదేరారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కట్టుదిట్టమైన భద్రత నడుమ నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా పరీక్ష రాయాలని సూచించారు. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), రాష్ట్ర ప్రభుత్వాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, యువత భవిష్యత్తుతో ఆడుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కోల్‌కతాలో మూడు స్వదేశీ నౌకలను ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోదీ తెలిపారు.

మూడు నౌకల ప్రత్యేకతలు

దూనగిరి: ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన



ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.


సంశోధక్: ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

అగ్రే: ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

# బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు.. రజతోత్సవ వేడుకలకు హాజరుకానున్న చంద్రబాబు

అమరావతి: క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది.



ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతానికి పైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా కూడా వేలాది మందికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా విజయవంతమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు ఇక్కడ నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అత్యాధునిక సదుపాయాలున్న మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ వంటి విభాగాల్లో సుమారు 250 మంది నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. సోమవారం జరగనున్న రజతోత్సవ వేడుకలకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరై ఆసుపత్రి 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని స్మరించుకోనున్నారు.

# 'రైతులపై బాబు ప్రేమ బూటకం- మోసం.. నిజం'

మొదటి పేజి తరువాయి

ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా, కరోనా వచ్చినా, ఒక్క సంవత్సరం కూడా తప్పలేదు. పైగా మేము మేనిఫెస్టోలో చెప్పినదానికన్నా మిన్నగా చేశాం. ఎన్నికల ముందు రాజమండ్రి వేదికగా నిలబడి, పీఎం-కిసాన్‌కు అదనంగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20,000 ఇస్తానని ఘనంగా ప్రకటించారు. ఇప్పుడు అదే రైతులను మోసం చేసి, మళ్లీ రైతు ప్రేమికుడిలా మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఈ ట్వీట్‌కు మీరు మాట్లాడిన మాటలు జతచేస్తున్నాను. ..2024-25లో పీఎం-కిసాన్‌కు అదనంగా మీరు ఇస్తానన్నది ఇవ్వకుండా ఎగరగొట్టింది రూ.20,000. రైతులకు ఇచ్చింది.. సున్నా. 2025-26లో ఇవ్వాల్సింది రూ.20,000. ఇచ్చింది కేవలం రూ.14,000 మాత్రమే. 2026-27లో ఇవ్వాల్సింది రూ.26,000. ఇప్పటివరకు ఇచ్చింది.. కేవలం రూ.5,000. అంటే మూడేళ్లలో ఒక్కో రైతు కుటుంబానికి మీరు ఇచ్చిన హామీ ప్రకారం పీఎం-కిసాన్ కాకుండా రూ.60,000 ఇవ్వాల్సి ఉండగా, ఇచ్చింది కేవలం రూ.19,000. ..పైగా మీరు పథకం నుంచి 7 లక్షల మందిని నిర్దాక్షిణ్యంగా తొలగించారు. మా హయాంలో 53.58 లక్షలమంది రైతు కుటుంబాలకు పెట్టుబడి సహాయం అందితే, మీరు దాన్ని 46.85లక్షల మందికి కుదించారు. కౌలు రైతులకు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలున్న గిరిజనులకూ మొండిచేయి చూపారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. ధరల స్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారు. ఐదేళ్లలో ధరల స్థిరీకరణ కింద రూ.7,800 కోట్లు ఖర్చు చేసి, రైతులకు గిట్టుబాటు ధరలకు



కేరాఫ్ అడ్రస్‌గా మేం నిలిచాం. ఈ రెండేళ్లలో మీ హయాంలో వరి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి, మినుములు, పెసలు, సజ్జలు, మిర్చి, పొగాకు, ఉల్లి, టమోటా, కోకో, చీనీ, మామిడి ఇలా పంటల ధరలు పడిపోయినా మీకు పట్టనట్టే వ్యవహరించారు. ..ఉచిత పంటల బీమాను రద్దుచేశారు. రైతులే ఇప్పుడు ఇన్సూరెన్స్ డబ్బులు కట్టుకోవాల్సిన పరిస్థితి. రైతులు కష్ట, నష్టాలు భరించి ఇన్సూరెన్స్ కట్టినా, మీరు ప్రభుత్వం నుంచి కట్టాల్సిన ప్రీమియంకూడా కట్టకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. కాని, మా హయాంలో రూ.7,802కోట్లు పంటల బీమా కింద ఇచ్చాం, రైతులు ఒక్క రూపాయి కూడా కట్టకుండానే...ఏ సీజన్లో నష్టం జరిగితే అదే సీజన్లో ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ ఆపేశారు. ఇప్పటికి 8 నెలలు దాటుతున్నా మొంథా తుపాను బాధిత రైతులకు ఇప్పటికీ ఒక్కపైసా ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదు. రైతులకు అందే సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేశారు. ఉద్దేశ పూర్వకంగా ఆర్బీకేలను, ఈ-క్రాప్‌ను, టెస్టింగ్ ల్యాబులను నాశనం చేశారు...ఆక్వారైతులను నట్టేట ముంచారు. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉన్న అప్పడా అనుమతి లేకుండానే ఫిబ్రవరిలో కిలో ఆక్వాఫీడ్‌కు రూ.4లు పెంచారు, జూన్‌లో మరో రూ.10- రూ.12లు పెంచారు. కిలోకు ఏకంగా రూ.14- రూ.16లు చొప్పున పెంచుకుంటూ పోయారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత టన్ను రొయ్యలమేత ధర రూ.72వేల నుంచి రూ.1.08లక్షలకు అమాంతంగా పెంచేస్తే, మరోవైపు 100 కౌంట్ రొయ్యల ధర రూ.225కు పడిపోయిన పరిస్థితి...ధరలు తగ్గించాలని, లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామంటూ మేం ఇచ్చిన అల్టిమేటంతో మళ్లీ కిలోకు రూ.4లు తగ్గిస్తామని ప్రకటించి, తీరాచూస్తే తగ్గించింది కేవలం రూ.2లు మాత్రమే. ఇక మీరు రైతులకు చేసిందేమిటి? మోసం తప్ప? పవర్ ఫ్యాక్టర్ పేరుతో ఆక్వారైతులకు మేం అమలు చేసిన కరెంటు సబ్సిడీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ..మామిడి రైతుల పరిస్థితీ అంతే. గత ఏడాది కిలోకు రూ.12లు చొప్పున రైతులకు ఇస్తామని ప్రకటించి, ఇవ్వాల్సిన రూ.380కోట్లు ఇవ్వకుండా ఎగ్గొట్టారు. మళ్లీ ఈ ఏడాది ధరల సంక్షోభం వచ్చింది. కిలోకు రూ.4లు ఇస్తామంటూ మళ్లీ రైతులను మోసం చేయాలని చూస్తున్నారు. ఇంతకన్నా నిస్సిగ్గుతనం ఏముంటుంది?. పొగాకు ధర కుప్పకూలిపోయినా మీకు చీమకుట్టినట్టైనా లేదు. సీఎం సరాసరి ధర కిలోకు రూ.200 ప్రకటిస్తే, ఆ మరుసటి రోజు ఆ ధర రూ.182లకు పడిపోయింది. ట్రాక్టర్లతో రైతులు చేసిన ఆందోళన మీ కళ్లకు కనిపించడంలేదా?. ఇక మీరు రైతులకోసం ఏంచేసినట్టు చంద్రబాబూ మీరు రైతులకు ఇచ్చింది వాగ్దానాల మోసం, బకాయిల భారం, నిరాశ మాత్రమే" అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు.

## యోగా నాకు చాలా ఇచ్చింది

మొదటి పేజి తరువాయి

శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖలో ఘనంగా యోగా వేడుకలు

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కర్ణాటక రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్..

మొదటి పేజి తరువాయి

కాగా, 2023 సెప్టెంబర్‌లో అధికారికంగా ఎన్డీయేలో చేరిన జేడీఎస్, బీజేపీతో కలిసి కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో జేడీఎస్ అధినేత హెచ్‌డీ కుమారస్వామికి కేంద్రంలో మంత్రి పదవి కూడా లభించింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన రెండు పార్టీలు, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత అనుమానాల మేఘాల్లో చిక్కుకున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల బదిలీ ఆశించిన స్థాయిలో జరగలేదని, కూటమి ఎమ్మెల్యేలలో కొందరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో బీజేపీ--జేడీఎస్ మధ్య ఉన్న సత్సంబంధాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైకి ఐక్యత కనిపిస్తున్నప్పటికీ, లోలోపల అసంతృప్తి ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఈ ప్రచారాన్ని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కొట్టిపారేశారు. బెంగళూరులోని జేడీఎస్ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీతో తమ పొత్తులో ఎలాంటి సమస్య లేదన్నారు. త్వరలో ఢిల్లీ వెళ్లి బీజేపీ జాతీయ అధ్యక్షుడిని కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై పూర్తి వివరాలు తెలియజేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయని కుమారస్వామి ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు ఎవరు చేస్తారు? ఎవరికి ఫిర్యాదు చేయాలి? అని ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత వెలుగులోకి వచ్చిన క్రాస్ ఓటింగ్ వివాదం కూటమి భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు కర్ణాటక రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ప్రపంచానికి యోగా ఓ వరం

మొదటి పేజి తరువాయి



ప్రతి మనిషికి దినచర్యలో యోగా ఓ భాగం కావాలని ఆకాంక్షించారు. గ్రామ, మండల స్థాయిలో యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ యోగా కార్యక్రమాల్లో అధికారులతోపాటు ప్రజలు పాల్గొంటున్నారని మంత్రి అనిత తెలిపారు. నేడు చిన్న చిన్న పిల్లలు కూడా ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా జీవించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతేడాది విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ యోగాసనాలు వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొన్నారని హోం మంత్రి అనిత వివరించారు.

### ప్రపంచానికి యోగా పరిచయం చేసిన భారత్: పల్లా

ప్రపంచానికి యోగాను భారత్ పరిచయం చేసిందని టీడీపీ ఏపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీవనశైలిలో యోగా భాగం కావాలన్నారు. యోగాను సీఎం చంద్రబాబు గ్రామీణ స్థాయిలోకి తీసుకెళ్తున్నారని వివరించారు.

### వర్షం కారణంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చాం: జిల్లా కలెక్టర్

గత నెల రోజులుగా విశాఖపట్నం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. డిఫెన్స్ అండ్ ఎక్స్- సర్వీస్‌మెన్ థీమ్‌తో నేవీ సహకారంతో ఈ యోగా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, జిల్లా ప్రజా ప్రతినిధులతోపాటు పాలనా యంత్రాంగం భాగస్వామ్యం అయిందని అన్నారు. ఇందులో నేవీ, స్టీల్ ప్లాంట్, ఏయూతోపాటు పలు సంస్థలు ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నాయని వివరించారు. రుషి కొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వంటి పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించాల్సిన ప్రధాన కార్యక్రమాన్ని వర్షం కారణంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చామని జిల్లా కలెక్టర్ అభిషిక్త కిశోర్ చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. యోగాను ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప సంపద అని అభివర్ణించారు. యోగా ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ పొందాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని పేర్కొన్నారు. యోగా ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని, మరింత మందికి చేరవేయాల్సి బాధ్యత ఉందని విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ చెప్పారు.

శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704


# మృతుల కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి గారు





ఎమ్మిగనూరు(నందవరం )శివసూర్య )జూన్ 21:ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామ కమిటీ అధ్యక్షులు స్వర్గీయులు అయినట్లు తెలిసిన వెంటనే ఎమ్మిగనూరు శాసనసభ్యులు గౌరవనీయులు డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి వారి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.- అలాగే రెండు రోజుల క్రితం నందవరం మండలం గురజాల గ్రామానికి చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్, బెస్త జ్యోతిమూర్తి, మిట్ట సోంపురం గ్రామ అధ్యక్షుడు బోయ రామలింగడు గారి సతీమణి మరణించిన సందర్భంగా వారి స్వగృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు, ఎమ్మిగనూరు మరియు నందవరం మండల అధ్యక్షులు, ఆయా గ్రామాల కమిటీల సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఆరోగ్యకర జీవనం.. "యోగా"తో సౌభాగ్యం! గజ్జెహాల్లిలో ఘనంగా యోగ కార్యక్రమాలు..

ప్రజావగాహనకే అంతర్జాతీయ యోగా దినోత్సవం.. గ్రామ పంచాయతీ సెక్రెటరీ నాగరాజు

'వ్యాయామవిద్య'తో గ్రామంలో ప్రతి ఒక్కరికి శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు శాంతి.!... హై స్కూల్ హెచ్ఎం నరసింహారెడ్డి



హొళగుంద శివసూర్య న్యూస్ (జూన్ 21) తనువును మనసును ఆత్మను ఏకం చేసే ఒకే ఒక్క సాధనమే యోగ.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలం పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో హై స్కూల్ ఎంపీపీ స్కూల్, మరియు గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు





యోగ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది .సంపూర్ణ ఆరోగ్యానికి ఖర్చు లేని మందు.. మానసిక వికాస సిద్ధి.. శరీరం -మనసు మధ్య సమతుల్య సాధనకు సహాయపడేది యోగ ఒక్కటే అనే నినాదం మారుమోగుతోంది.హొళగుంద మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో యోగ కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక మండలం పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో ఆదివారం యోగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హై స్కూల్, ఏం పి యు పి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,ఆసుపత్రి సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, హై స్కూల్ హెచ్ఎం నరసింహారెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ నాగరాజు, ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ... యోగ ఒక ప్రాచీన భారతీయ జీవన విధానం.. దీని ద్వారా శరీరం మనసు మెదడును పూర్తిగా ఆరోగ్యంగా ఉంచవచ్చు తద్వారా గ్రామంలో ఉండే ప్రతి ఒక్కరు యోగాసనం వేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# మంత్రాలయంలో యోగా సందడి.. పరిమళ విద్యానికేతన్‌లో ప్రముఖుల ఆసనాలు



మంత్రాలయం,శివసూర్యప్రతినిధి(జూన్ 20: మంత్రాలయం పరిమళ విద్యానికేతన్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు, ముఖ్య అతిథులు అందరూ కలిసి శ్రీ రాఘవేంద్ర స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు, యోగా గురువు శ్రీకృష్ణ మాట్లాడుతూ "యోగా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత ప్రసాదిస్తుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని జయించేందుకు ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాలు యోగా సాధన చేయాలి. విద్యార్థి దశ నుంచే యోగాను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది" అని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో యోగాకు విశిష్ట స్థానం ఉందని, ప్రతి ఇంటా యోగా వెలుగులు నింపాలని రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ నాగభూషణం, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, రాగన్న తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడి.. జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభకు ఫ్లెక్సీ గౌరవం



మంత్రాలయం,శివసూర్యప్రతినిధి(జూన్ 20:గతంలో ర్యాంకుల ఫ్లెక్సీలు అంటే ప్రైవేటు స్కూళ్లే గుర్తుకొచ్చేవి. ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ మంత్రాలయం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 2026 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులతో రాణించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లోనూ సత్తా చాటారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రభుత్వ బడి పిల్లలు వెనుకబడలేదని నిరూపించారు. ఈ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపుగా మంత్రాలయం పట్టణంలోని ప్రధాన కూడలిలో భారీ ఫ్లెక్సీ వెలిసింది. ఫ్లెక్సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో పాటు జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల వివరాలు ఉన్నాయి. విద్యార్థుల విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందం కృషిని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ప్రత్యేకంగా అభినందించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, క్రీడా శిక్షణ అందుతోంది. దీన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# మంత్రాలయం మఠంలో సోమయాగం.. రెండో రోజున వేద ఘోష



మంత్రాలయం,శివసూర్యప్రతినిధి(జూన్ 21:శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ శ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం, విద్వాన్ డోన్ రాఘవేంద్రాచార్యుల పర్యవేక్షణలో మంత్రాలయంలో జూన్ 20న సోమయాగ క్రతువు ప్రారంభమైంది. ఈ మహా యాగం ఈనెల 24వ తేదీ వరకు అప్రతిహతంగా కొనసాగనుంది. అందులో భాగంగా రెండవ రోజైన ఆదివారం వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తూ, శాస్త్రోక్తంగా సోమయాగాన్ని అత్యంత నిష్ఠతో నిర్వహించారు. సోమలతా రసాన్ని మంత్రపూర్వకంగా అగ్నిదేవునికి హవిస్సుగా సమర్పించడం ఈ యాగం ప్రత్యేకత. సోమయాగం నిర్వహించడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని, దేశ ప్రజలకు దీర్ఘాయువు, ఆరోగ్యం, సత్సంతానం, ఐశ్వర్యం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని రుత్విక్కులు వివరించారు. లోక కల్యాణం కోసం జరుగుతున్న ఈ యాగంలో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని మఠం నిర్వాహకులు కోరారు.


# హెబ్బటం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



హొళగుంద శివసూర్య న్యూస్ జూన్ 21:మండలం, హెబ్బటం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ పోరాట యోధుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలూరు టీడీపీ ఇంచార్జి శ్రీమతి వైకుంఠం జ్యోతి గారు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈబీజీ గోవింద్ గౌడ్ గారు హాజరయ్యారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి గారు మరియు ఈబీజీ గోవింద్ గౌడ్ గారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలహారం వేసి ఘనంగా నివాళులర్పించారు.డాక్టర్ అంబేద్కర్ గారు భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి మాత్రమే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య మరియు స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారు. ఆయన ఆశయాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకం. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే ఆయన సంకల్పం చిరస్మరణీయం.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అంబేద్కర్ గారి సేవలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో నడవాలని సంకల్పించారు.



# వెండి గజవాహనంపై ప్రహ్లాదుని వైభవోపేత ఊరేగింపు



మంత్రాలయం, శివ సూర్య ప్రతినిధి(జూన్ 21:మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం రాత్రి రథోత్సవం కనులపండువగా జరిగింది. బంగారం, వెండి, నవరత్నాలతో తయారు చేసిన చెక్క రథంపై ప్రహ్లాదుని ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి మఠం ప్రాకారంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఊరేగించారు.అంతకుముందు డోలోత్సవ మంటపంలో పాదపూజ, సర్వసేవ, పూర్ణసేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం మృత్తికా బృందావనాన్ని బంగారు పల్లకిలో ఉంచి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మూల బృందావనం, మంచాలమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మఠం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మూల బృందావనానికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేసి బంగారు కవచాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి, నైవేద్యం సమర్పించారు.

# వడియ రాజుల చరిత్రను వెలుగులోకి తెద్దాం.

- వడియ రాజుల క్షత్రియ సేవా సమితి జాతీయ అధ్యక్షులు కందుల చంద్రశేఖర్ వడియ రాజు...



కర్నూలు, శివసూర్య, జూన్ 21: వడియ రాజులకు ప్రాచీన కాలం నుంచి ఘనమైన చరిత్ర ఉందని.. ఆ చరిత్రను వెలుగులోకి తీసుకొస్తామని వడియ రాజుల క్షత్రియ సేవా సమితి జాతీయ అధ్యక్షులు కందుల చంద్రశేఖర వడియ రాజు అన్నారు. ఆదివారం కర్నూలు బళ్లారి చౌరస్తాలోని నాగేంద్ర నగర్ వడ్డెర భవనంలో.. ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు మొదటిసారిగా అందజేయడం జరిగింది. ఈ సభకు ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య సభకు అధ్యక్షత వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వడియ రాజుల క్షత్రియ సేవా సమితి జాతీయ అధ్యక్షులు కందుల చంద్రశేఖర వడియ రాజు తోపాటు జాతీయ ప్రధాన కార్యదర్శి కందుల రవీంద్ర వడియ రాజు గారు, జాతీయ నాయకులు మల్లె కృష్ణయ్య, పాణ్యం టిడిపి నేత గౌరు వెంకటరెడ్డి, వడ్డెర కళా సమితి అధ్యక్షులు తన్నీరు రమణయ్య గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుల చంద్రశేఖర వడియరాజు మాట్లాడుతూ.. వడ్డెరలు అందరూ వడియ రాజులుగా కీర్తించబడాలని అలాగే మన పేరు చివర వడియ రాజు అని పెట్టుకోవాలని ఆయన సూచించారు. బీసీ రిజర్వేషన్ల వల్ల కొన్ని కులాలే ప్రయోజనం పొందుతున్నాయని కావున వడ్డెరలకు ప్రత్యేక రిజర్వేషన్ కావాలని ఆయన డిమాండ్ చేశారు. వడ్డే దేశం నుంచి రావడం వలన వడ్డెరలుగా సంభోదిస్తూ కుల పట్టికలో పెట్టారు కానీ వీరంతా ఒకప్పటి మహారాజులు. శాసనాలలో ఉన్న విధంగా వొడ్డే రాజులు లేదా గజపతి రాజులు అని కుల పట్టికలో చేర్చాలి.. వడ్డెరలకు బదులుగా ఆయన కోరారు. వడియ రాజులకు జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి సరిపడు నిధులు కేటాయించాలి.. ఎందుకనగా ఉద్యోగ రాజకీయంగా చైతన్యవంతులు కావాలంటే ముందుగా నిరుపేదలైన వడియ రాజులు విద్యావంతులు అవ్వాలన్నారు. ఆ తర్వాత ఉద్యోగాలు సాధించాలి, ఉద్యోగాలు సాధించాలంటే వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. వడియ రాజులందరూ ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించుకోవాలన్నారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో ఐచీ అని కుల సర్టిఫికెట్లో వస్తుంది. కావున దీనివల్ల కలిగే లాభాలేంటో ప్రభుత్వమే తెలియజేయాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో వడియ రాజులందరూ ఐక్యమై వడియ రాజులకు కేటాయించిన అభ్యర్థులను ఐక్యంగా గెలిపించుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పాణ్యం టిడిపి సీనియర్ నేత గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రాజ్యాలు ఏలిన వడ్డెర రాజులందరూ నేడు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ప్రభుత్వం తరఫున వారికి చేయూతనిచ్చి ఆదుకుంటామని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా నాయకులు చిరంజీవి, బండ రవి, వెంకటేశ్వర్లు, ఎల్లా శివుడు, చంద్రికమ్మ, సర్వేశ్వర బాబు, రామకృష్ణ, నంద్యాల జిల్లా నాయకులు రామసుబ్బయ్య, చల్లా వెంకటేష్, డివిఎస్ రాజు, గణమద్దయ్య, గోగుల చక్ర ధర్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అంబా భవాని ఆలయంలో హిందూ సంఘాల సమావేశం



గద్వాల, శివసూర్య, జూన్ 21: సామాజిక సమరసత, హిందువుల ఐకమత్యం, కులమత వర్గ వైషమ్యాల నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధం, మతమార్పిడుల నివారణ వంటి పలు కీలక అంశాలపై నేడు అంబా భవాని ఆలయ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విహెచ్‌పి మరియు పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హిందుత్వంపై దుష్ప్రచారం చేస్తూ, ముఖ్యంగా హిందూ యువతులను మతమార్పిడికి గురిచేస్తున్న కొన్ని శక్తుల చర్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ సమాజం ఐక్యంగా ఉండి సామాజిక సమరసతను కాపాడాల్సిన అవసరంపై నాయకులు చర్చించారు.ఈ కార్యక్రమంలో అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లా ఆచార్య సంపర్గ్ ప్రముఖ్ చక్రవర్తి చార్యులు, పాలమూరు విభాగ్‌కు చెందిన పుల్లరి నాగకృష్ణ, భరత్ రెడ్డి, వెంకటేష్, జలగరి అశోక్, వాగుబాయి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఆచార్య సంపర్క్ ప్రముఖ్ చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, "హిందూ సమాజంలో ఐకమత్యం, పరస్పర గౌరవం, సామాజిక సమరసత పెంపొందితేనే ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుంది" అని అన్నారు.

# విహెచ్పి డీ.డీ.ఎన్.ఏస్. ఆధ్వర్యంలో చాలీసా విష్ణు సహస్రనామం



జోగులాంబ, శివసూర్య జూన్ 21 గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# పురాణాల్లో పితృస్థానం గొప్పగా వర్ణించబడింది -- పితృ దినోత్సవ శుభాకాంక్షలు: ఆచార్య చక్రవర్తి చార్యులు



అలంపూర్, శివసూర్య, జూన్ 21:పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు పితృ దర్శనం, పితృ ఆరాధన సేవా కార్యక్రమాన్ని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేదాలు మరియు పురాణాల్లో మాతృ--పితృ సేవలను భగవంతుని సేవతో సమానంగా వర్ణించారని తెలిపారు. తల్లిదండ్రులు మనకు ప్రత్యక్ష దైవమని, పితృ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి వారి శుభాశీస్సులు, మంగళాశాసనాలు పొందాలని సూచించారు.సనాతన ధర్మంలో తల్లిదండ్రుల స్థానం అత్యున్నతమైందని, వారిని గౌరవించడం ప్రతి మనిషి కర్తవ్యమని ఆచార్య చక్రవర్తి చార్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జూన్ 21: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. అంత ర్జాతీయ యోగా దినోత్సవా న్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలో ప్రకృతి ఒడిలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యోగా సాధన నిర్వహించి యోగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమ ప్రారంభంలో యోగా శిక్షకుడు కుమ్మరి నర్సింలు పోలీసు అధికారులు, సిబ్బందికి యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయా మ విధానాలను వివరించి ప్రదర్శించారు. అనంతరం జిల్లా ఎస్పీతో పాటు అధికా రులు, సిబ్బంది వివిధ రకాల యోగాసనాలు, ప్రాణాయా మాలు నిర్వహించి అంత ర్జాతీయ యోగా దినోత్సవా న్ని ఘనంగా జరుపుకు న్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూజిల్లా ప్రజలకు, పోలీసులకు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాం క్షలు తెలియజేశారు. యోగా భారతదేశంలో పుట్టిన గొప్ప ఆధ్యాత్మిక, ఆరోగ్య సంపద అని, నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది యోగాను ఆచరిస్తూ ఆరోగ్యకర జీవన విధానాన్నిఅలవర్చుకుంటున్నారని పేర్కొన్నారు.యోగా అనేది వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చేయగలిగే సమగ్ర ఆరోగ్య సాధన అని తెలి పారు. ప్రతిరోజూ యోగాస నాలు, ప్రాణాయామాలు చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతో పాటు అనేక అనారోగ్య సమస్యల ను దూరం చేసుకోవచ్చని చెప్పారు. మానసిక ప్రశాం తత, ఏకాగ్రత,ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ముఖ్యంగా పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది రేయింబవళ్లు ప్రజల భద్రత కోసం విధులు నిర్వర్తిస్తూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో యోగా, ధ్యానం ఎంతో ఉపశమనం కలిగిస్తా యని ఎస్పీ తెలిపారు. రోజూ కొంత సమయాన్ని యోగా సాధనకు కేటాయించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులను మరింత సమర్థవం తంగా నిర్వహించవచ్చని సూచించారు.యోగాసనాలు, ప్రాణాయామాలు శరీరంలో ని ప్రతి అవయవానికి మేలు చేయడమే కాకుండా మన సుకు ప్రశాంతతను అంది స్తాయని, గుండె ఆరోగ్యం మెరుగుపడటానికి కూడా యోగా ఎంతో ఉపయోగ కరమని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక ఉత్తమమైన మార్గమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం గా చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎన్.లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్ రెడ్డి, ఆర్ఐ విజయభాస్కర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, విక్రమ్, రమేష్, విజయ్ భాస్కర్, సునీత, శివశంకర్, శిరీష, పేట సర్కిల్ పోలీసు సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేట కోర్టు ప్రాంగణంలో ఘనంగా యోగా దినోత్సవం

నారాయణపేట జూన్ 21:నారాయణపేట కోర్ట్ ప్రాంగణంలో ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తిబోయశ్రీనివాసులు.తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయ ణపేట జిల్లా న్యాయస్థానం ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివా సులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు,ఈ సందర్భం గా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని మహిళలు తప్ప నిసరిగా యోగా సాధన చేయాలని సూచించారు. మహిళలకు శారీరక సమ స్యలు ఎక్కువగా ఉంటాయి యోగ శరీరానికి మనసుకు శాంతిని కలిగిస్తుందని అన్నా రు. అయితే యోగాలో ఫలి తాలు తొందరగా రావు ఇది కొంత దీర్ఘకాలిక ప్రక్రియ ఓపికతో సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయిని అన్నా రు. యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకో వాలని, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ యోగా చేయాలని పిలుపునిచ్చారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించవచ్చని వివరించారు. ప్రతిరోజూ ఉదయం వేళ కొంత సమ యం కేటాయించి యోగా చేయడం వలన వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. తదు పరి యోగా మాస్టర్ ప్రవీణ్ కుమార్ చేత యోగ భంగి మలలో బాలాసనం, భుజం గాసనం, ధనురాసనం, సేతు బంధాసనం శవాసనం పలు యోగాసనాలు ప్రదర్శించా రు. తదుపరి యోగ మాస్టర్ చూపించిన వివిధ భంగిమ లను తెలిపినందుకు మాస్టర్ ని అభినందిస్తూ శాలువా తో సత్కారం చేశారు . ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, న్యాయవాదులు, యోగా మాస్టర్ ప్రవీణ్ కుమా ర్, కోర్ట్ సిబ్బంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగ అలవాటు చేసుకోవాలి -- జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



ఐజ, శివసూర్య, జూన్ 21:నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో పాటు యోగాను నిత్య జీవితంలో భాగంగా అలవాటు చేసుకోవాలని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యోగా ద్వారా శారీరకంగా దృఢత్వం, మానసికంగా స్థైర్యం పొందవచ్చని తెలిపారు.ప్రస్తుత సమాజంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ దీన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజ పట్టణ ప్రముఖులు, భజన భక్తులు మరియు ఇతరులు పాల్గొన్నారు. యోగా మనిషికి ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక ఐకమత్యాన్ని కూడా పెంపొందిస్తుందని ఈ సందర్భంగా వివరించారు.

## శుద్ధ సప్తమి సందర్భంగా శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు ఆచార్య



ఐజ, శివసూర్య జూన్ 21 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ట మాసం అంతర్జాతీయ యోగా దినోత్సవం శుద్ధ సప్తమి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ త్రిపుల్ మర్డర్ కేసును ఛేదించిన నల్గొండ జిల్లా పోలీసులు.

## సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్.

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ .




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల 4వ తేదీన జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు సజీవదహనమై మృతి చెందిన కేసును నల్గొండ జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా భావించిన ఈ ఘటన వెనుక పథకం ప్రకారం జరిగిన హత్య ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆదేశాల మేరకు, డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, ఊళ్ళ పాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. నిందితుడు గతంలోనే వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు, మోసాలకు పాల్పడిన చరిత్ర కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది.తెలుగు మ్యాట్రిమోనీ వంటి వివాహ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారి నమ్మకాన్ని సంపాదించి వివాహం చేసుకోవడం లేదా వివాహం చేసుకుంటానని నమ్మించి ఆర్థిక ప్రయోజనాలు పొందడం నిందితుడి అలవాటుగా మారినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే విధంగా బాధితురాలు ధనలక్ష్మితో కూడా పరిచయం ఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడు.కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. హాజీపూర్‌లో ఒక మహిళను మోసం చేసిన కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసం ప్రయత్నించకపోవడం పట్ల నిందితుడు తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ధనలక్ష్మి ఆమె పిల్లలను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు.తన ప్రణాళికలో భాగంగా నేరానికి కొన్ని రోజుల ముందే పరిస్థితులను పరిశీలించాడు.సంఘటన జరిగిన రోజు ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించి మిర్యాలగూడ వైపు బయలుదేరాడు.మార్గమధ్యలో ఒక ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ బంకులో పెట్రోల్ నింపించుకున్నాడు.అనంతరం పలు ప్రాంతాల్లో తిరుగుతూ రాత్రి వరకు సమయం గడిపి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.రాత్రి సమయంలో బాధితుల ఇంటి పరిసరాలను గమనించి అందరూ నిద్రలో ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించాడు.అక్కడ ఉన్న ప్లాస్టిక్ బకెట్‌లో పెట్రోల్ పోసి నిద్రిస్తున్న వారిపై చల్లాడు. అనంతరం అగ్గిపుల్ల గీసి మంటలు అంటించి సంఘటనను ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలా కనిపించేలా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మంటలు నిందితుడికి కూడా అంటుకున్నప్పటికీ అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు.బాధితురాలు ధనలక్ష్మి సంఘటన జరిగిన రోజు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. అయితే ఇంట్లో నిద్రిస్తున్న ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17), కుమార్తె ప్రణతి (15) మంటల్లో చిక్కుకుని సజీవదహనమై మృతి చెందారు. సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు, కాలిపోయిన ఇంటి వెనుక భాగంలో లభించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్, వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలు, ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేశారు.నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, పాక్షికంగా కాలిపోయిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఘటనాస్థలంలో వదిలివెళ్లిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తిస్థాయి వివరాలు, నేపథ్యాన్ని నిర్ధారించుకున్న తర్వాతే సంబంధాలు ఏర్పరచుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి, మిర్యాలగూడ × టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్‌లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు నగదు రివార్డులను ప్రకటించారు.

# యోగా జీవితంలో భాగం కావాలి మోదీ చొరవతో ప్రపంచ యోగా దినోత్సవం

## స్పష్టం చేసిన వక్తలు





నారాయణపేట జూన్ 21 ‘ :ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని యోగాతో మంచి ఆరోగ్యం సమకూరుతుందని ప్రధాన వక్తలు స్పష్టం చేశారు.అలాగే ప్రధాని నరేంద్రమోడీ చొరవతోనే ప్రపంచ యోగా దినోత్సవం ప్రతి దేశంలో జరుపుకుంటున్నారని అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం నారాయణపేట లోని పతంజలి యోగా కేంద్రంలో జిల్లా యోగా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథు లుగా , బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ , కుంగ్ ఫు అధ్యక్షుడు రఘువీర్ యాదవ్,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ , మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత , వైస్ చైర్మన్ మంజుల యోగా గురువులు ప్రజాప్రతి నిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో యోగా సాధన చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక, శాస్త్రీయ జీవన విధానం యోగా అని అన్నారు. వేల సంవత్సరాల క్రితమే భారతీయ ఋషులు మానవ సంక్షేమం కోసం అందించిన ఈ మహోన్నత సాధన నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ఆరోగ్యం, మానసిక ప్రశాంత త,ఆత్మవిశ్వాసాన్ని అంది స్తోందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం భారతదేశ ఆధ్యాత్మిక వైభవానికి ప్రపంచ గుర్తింపు లభించిన చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. 2015 నుంచి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వ హిస్తుండటం భారతదేశాన్ని విశ్వగురు స్థానానికి మరింత చేరువ చేస్తోందని తెలిపారు.యోగ అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని,శరీరం--మనస్సు--ఆత్మలను సమన్వయం చేసే సంపూర్ణ జీవన విధానమని పేర్కొన్నారు. ఆధునిక జీవ నశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, నిరాశ, కోపం, ద్వేషం వంటి ప్రతి కూల భావాలను తొలగించి ఆత్మశాంతి, మానసిక ప్రశాం తత, సానుకూల ఆలోచనల ను పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుం దని తెలిపారు.మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని అన్నారు. యోగా ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబ, సామాజి క,జాతీయ స్థాయిలో సాను కూల మార్పులు సాధ్యమ వుతాయని పేర్కొన్నారు.భారతీయ సంస్కృతి ప్రపం చానికి అందించిన “వసుధైవ కుటుంబకం” అనే భావన నేడు మరింత ప్రాసంగికంగా మారిందన్నారు. ప్రపంచమం తా ఒక కుటుంబమనే ఆలో చనతోనే శాంతి, సామర స్యం, మానవతా విలువలు వికసిస్తాయని, యోగా ఆ భావనను ఆచరణలో చూపించే మహత్తర సాధ నమని వివరించారు.యుద్ధాలు, హింస, మానసిక అశాంతి పెరుగుతున్న ప్రస్తు త పరిస్థితుల్లో ప్రపంచానికి యోగా అత్యవసరమైందని, భారతదేశం అందించిన ఈ అమూల్యమైన సంపదను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే ఆరోగ్య వంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన సమాజం, ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణం సాధ్యమవు తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న పలువురు యోగా సాధకులు యోగ సాధన ద్వారా తమ ఆరోగ్యంలో వచ్చిన మార్పు లు, పొందిన ప్రయోజనాల ను స్వయంగా వివరించారు. ముఖ్యంగా 65 సంవత్సరాల వయస్సు గల పదవీ విరమ ణ పొందిన ఉపాధ్యాయుడు ప్రదర్శించిన యోగాసనాలు సభికులను విశేషంగా ఆకట్టు కుని అందరి ప్రశంసలు అందుకున్నాయి.అనంతరం యోగా గురువులు కుంగ్ -ఫ్యూ విద్యార్థుల చేత వివిధ యోగాసనాలను ప్రదర్శిస్తూ, పాల్గొన్న వారితో యోగాభ్యాసం చేయించారు. యోగా సేవలను గుర్తిస్తూ గురువులను ఘనంగా సన్మానించారు. నిత్యం పతంజలి యోగా కేంద్రంలో యోగాభ్యాసం చేస్తున్న సాధ కులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# రఘునాథపాలెం 218 సర్వే నెంబర్ల నిర్వాసితులకు న్యాయం చేయాలి: బీఆర్ఎస్ నాయకులు



‘ ఖమ్మంఖమ్మం జిల్లా ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని 218 సర్వే నెంబర్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 625 మంది అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.నాడు రవాణా, మౌలిక వసతులు పూర్తిగా అందుబాటులో లేకపోయినా, లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్టుగా బేస్‌మెంట్లు నిర్మించుకుని, కొందరు చిన్నపాటి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అనంతరం అమరావతి హైవే నిర్మాణం పేరుతో కొన్ని ప్లాట్లు రద్దు చేయగా, మరికొన్ని మోడల్ స్కూల్ కోసం కేటాయించారని పేర్కొన్నారు. అయితే ఎటువంటి అడ్డంకులు లేని మిగిలిన సుమారు 350 ప్లాట్లను కూడా స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో భాగంగా గత పది రోజులుగా లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా బేస్‌మెంట్లు, నిర్మాణాలను కూల్చివేస్తున్నారని ఆరోపించారు.ఈ సమస్యను నిర్వాసితులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పార్టీ నాయకులను సంఘటన స్థలానికి పంపించారు. మాజీ నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బృందం నిర్వాసితులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. కూల్చివేతలతో శిథిలాలుగా మారిన నిర్మాణాలను చూసి నిర్వాసితులు భావోద్వేగానికి గురై ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడిన పగడాల నాగరాజు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఖమ్మం నగరంలో 3000 వేల మందికి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించకపోతే, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో, అప్పటి ఎంపీగా ఉన్న ప్రస్తుత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సుమారు 625 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారని గుర్తు చేశారు.అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, బోర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని ప్రోత్సహించారని, ప్రజలు కూడా తమకు చేతనైన మేరకు నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ వారి జీవితాలను రోడ్డున పడేస్తోందని విమర్శించారు.వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితుల సమస్య ఇంకా పరిష్కారం కాకముందే రఘునాథపాలెం 218 సర్వే నెంబర్లలో మరోసారి పేదల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని అన్నారు. ఇళ్లు నిర్మించే ప్రభుత్వాలను, పట్టాలు ఇచ్చే ప్రభుత్వాలను చూసామని, కానీ పేదల ఇళ్లను కూల్చే ప్రభుత్వాన్ని ఇప్పుడు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఖమ్మం నగరంలో వేలాది మంది పేదలకు ఇంటి పట్టాలు అందించిన ఘనత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌దేనని పేర్కొంటూ, ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం, మోడల్ స్కూల్ కోసం భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు, మిగిలిన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరారు. అలాగే అందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యపై త్వరలో నిర్వాసితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్, కందాల వీరేందర్, వాంకుడోత్ సురేష్, ఆరెంపల వీరభద్రం, సత్తార్ మియా, తీగల సతీష్ గౌడ్, పోలే రమేష్,పొంగు వెంకట్, మిర్యాల రమేష్,పిట్టల తిరుమల్ రమేష్గుంటి రాజు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక

జనరల్ న్యూస్

సోమవారం -22- జూన్ - 2026

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంబించిన శివారెడ్డి



నారాయణపేట జూన్ 21: ,నారాయణ పేట శాసన సభ్యులు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి,మాజీ డీసీసీ సభ్యులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం లింగంపల్లి గ్రామం లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సురేష్ చారీ నూతన గృహాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి ప్రారంబిం చారు. కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ జగన్,ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవరెడ్డి , మైనారిటీ కోఆప్షన్ సభ్యులు గౌస్ కొల్లంపల్లి, మాజీ ఎంపీటీసీ జనార్ధన్ గౌడ్, పేరపల్ల మాజీ ఎంపీటీసీ శంకర్, లింగంపల్లి పార్టీ కార్యకర్తలు భీంప్రకాష్, బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ సార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మండల కేంద్రంలో లో ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలు

సింగరేణి బిఆర్ఎస్ పార్టీ నాయకులు



ఖమ్మం జిల్లా, కారేపల్లి : జూన్ 21 : మండల కేంద్రంలో ఆదివారం నాడు తెలంగాణ సిద్ధాంతకర్త తెలంగాణ కి దిక్ సూచి ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి ని పురస్కరించుకొని మండల కేంద్రమైన సింగరేణి గ్రామం బస్టాండ్ సెంటర్లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సింగరేణి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.పార్టీ నాయకులు ముందుగా తెలంగాణ తల్లికి పూలమాల వేసి అనంతరం జయశంకర్ ఫోటోకు పూలమాల వేసి, ఫోటోకు పువ్వులు జల్లి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్ నాయక్ , మాజీ రైతు సమన్వాయ మండల అధ్యక్షులు , నాయకులు హనుమకొండ రమేష్ , మండల నాయకులు తాతా వెంకన్న , మండల నాయకులు డొంకెన రవీందర్ , సీనియర్ నాయకులు సింగరేణి మాజీ ఒకటవ వార్డ్ నెంబర్ గంగరబోయిన సత్యం , తెలంగాణ ఉద్యమకారుడు మండల యూత్ నాయకులు సోమందల నాగరాజు , సింగరేణి మాజీ ఉప సర్పంచ్ మణిగొండ నాగేశ్వరరావు , గేటు కారేపల్లి బిఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ కందుల శ్రీనివాస్ రావు , రావోజితండా మాజీ సర్పంచ్ భూక్య మోహన్ , తెలంగాణ ఉద్యమకారులు భాగ్యనగర్ తండా మండల నాయకులు గూగులోత్ జుంకీలాల్ , గిద్ద వారి గూడెం నాయకులు గుగులోత్ భగవాన్ లాల్ నరేష్ , కారేపల్లి నాయకులు పేర్ని వెంకటేశ్వర్లు, పొక్కిలి యుగంధర్ , పోతు రాములు , కొనగడ్ల శ్రీకాంత్ , బానోత్ రాజేష్, ఖలీల్ ఖాన్ , పిల్లి వెంకటేశ్వర్లు , నాలి రాజు , రామారావు , దేవ , తదితరులు పాల్గొన్నారు

# శుభకార్యాల్లో పాల్గొన్నమాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



నారాయణపేట జూన్ 21:నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఆదివారంనియోజకవర్గంలోని పలు శుభాకార్యలలో పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ కేంద్రంలో ఎ బి కే ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆంధ్రప్రభ స్టాఫ్ రిపో ర్టర్ కె. నారాయణరెడ్డి కుమారుని నిక్షితార్త కార్యక్రమంలో పాల్గొని శు భాకాంక్షలు తెలిపారు.అలాగే జిల్లా కేంద్రములోనీ 14వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త ఆనంద్ నూతన స్టీల్ దుకాణము, 6వ వార్డు గుంజిలప్ప నూతన హార్డ్ వేర్ దుకాణము ప్రారంభోత్సవ పూజా కార్యక్రమములో పాల్గొనీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలు..



మధిర ::మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మధిర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో తెలంగాణ మట్టిగడ్డను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ,తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక పునాదులు వేసిన మహోన్నత దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకలను పార్టీ కార్యాలయం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ చివరి శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకే అంకితమైన ఆయన జీవితం,పోరాటం,త్యాగం ఇప్పటి తరతరాలకు స్ఫూర్తి అని ఇప్పటివారు వారి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది అని కొనియాడారు ప్రతి ఒక్కరు జయశంకర్ స్ఫూర్తి తీసుకొని తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనపై సమర శంఖం పూరించాలని క్యాడర్లో స్ఫూర్తిని కలిగించారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో లింగాల కమల్ రాజు తో పాటుగా మధిర మేజర్ సొసైటీ అధ్యక్షుడు బిక్కి కృష్ణ ప్రసాద్,మధిర మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్ వైవి అప్పారావు నాయకులు రావూరి శ్రీనివాసరావు పల్లపోతు వెంకటేశ్వరరావు,చిత్తారు నాగేశ్వరరావు,వంకాయలపాటి నాగేశ్వరరావు,మాజీ కౌన్సిలర్లు కొటారు రాఘవరావు,సయ్యద్ ఇక్బాల్,పరిశ శ్రీనివాసరావు,ఆళ్ల నాగబాబు,చీదిరాల రాంబాబు,అబ్దుల్ ఖురేషి,అబ్బురి రామన్, నాగులవంచ రామారావు,షేక్ జాన్ సైదా,చారి, కంచం మురళి,కోట కోటేశ్వరరావు,వీరంశెట్టి సీతారామయ్య,లంకేమల్ల నాగేశ్వరావు, అంగడాల గోపి,కుర్ర రంజిత్,దిల్,తదితరులు పాల్గొని జయశంకర్ కి నివాళులు అర్పించినారు...

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల సమీక్ష నేపథ్యంలో 22.06.2026

# సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమం రద్దు...

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం ::ఈ నెల 30 న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లాకు విచ్చేస్తున్న నేపథ్యంలో నేడు (సోమ వారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలన, సమీక్ష కు ఉప ముఖ్యమంత్రి నేడు జిల్లా పర్యటన చేపడుతున్నారని, ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం మొత్తం ఏర్పాట్లలో నిమగ్నమై ఉండనున్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ ఒక్క రోజు మాత్రమే రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, తమ సమస్యలు, వినతిపత్రాలను సమర్పించడానికి నేడు కలెక్టరేట్ కు రావద్దని, ఇట్టి విషయమై ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

# భారాస సమావేశాన్ని విజయవంతం చేద్దాం

# రేపు నరేన్ గార్డెన్ లో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని పిలుపు

ఉద్యమకారులు,డివిజన్ నేతలు, పార్టీ లీడర్లు పెద్ద ఎత్తున హాజరు కావాలి

శేరిలింగంపల్లి ఉద్యమకారులు చిర్రా రవీందర్ యాదవ్ వెల్లడి



శేరిలింగంపల్లి:శేరిలింగంపల్లి నియోజకవర్గంకు సంబంధించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంకు భారాస శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని సీనియర్ నేత, ఉద్యమకారులు చిర్రా రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. రేపు మంగళవారం మియాపూర్ లోని నరేన్ గార్డెన్ లో జరగబోయే సమావేశానికి భారా సంఖ్యలో తరలి రావాలన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా వచ్చి అవగాహన కల్పించనున్నారని, సమావేశాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీ నేతలు, ఉద్యమకారులు యువజన నాయకులు విద్యార్థి నాయకులు స్థానిక డివిజన్ లీడర్లతో పాటు అందరూ ఒక్కతాటిపై నడిచి కార్యక్రమం సక్సెస్ చేసేలా చూడాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తున్న భారాసకు ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. ప్రతి డివిజన్ లో వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓట్ల తొలగింపు చేసే ప్రమాదం పొంచి ఉందని, ఆయా డివిజన్ లలో ఓటర్లలకు సంబంధించి స్థానిక నేతలు పర్యావేక్షించాలని, అందుకు సంబంధించి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశంలో దిశానిర్ధేశం చేయనున్నారని స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమంకు పెద్ద ఎత్తున స్థానిక నేతలు, కార్యకర్తలు తరలి రావాలని చిర్రా రవీందర్ యాదవ్ కోరారు.

# : నీట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

# నిబంధనల అమలుపై నిశిత పరిశీలన

# 86.55 శాతం మంది అభ్యర్థులు హాజరు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి , జూన్ 21 : కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిజామాబాద్ జిల్లాలో ఆదివారం నీట్ పరీక్షను సాఫీగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేసి, నీట్ ఎగ్జామ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ. కెమెరాలు పని చేస్తున్నాయా అన్నది గమనించిన కలెక్టర్, వాటి ఫుటేజీల ఆధారంగా నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయో-మెట్రిక్ హాజరు సేకరణలో ఏవైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్, పేపర్ లీక్ కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద ఏర్పాటు చేసిన జామర్ లను, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. అభ్యర్థుల అడ్మిట్ కార్డు, ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరిచూసుకున్న మీదటే, మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎన్.టీ.ఏ నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని, ఆన్సర్ షీట్స్, ఎగ్జామ్ మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ కు చేరుకునే వరకు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, జిల్లాలో నీట్ పరీక్షకు 86.55 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. మొత్తం 3459 మంది అభ్యర్థులకు గాను 2994 మంది పరీక్ష రాయగా, 465 మంది గైర్హాజరయ్యారని వివరించారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, సజావుగా నీట్ పరీక్షలు జరిగాయి. కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఆయా రూట్ల వారీగా ప్రశ్న పత్రాలు, ఇతర సామాగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. అన్ని కేంద్రాల వద్ద 164 (బీ.ఎన్.ఎస్) నిషేధాజ్ఞలు అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

# కారేపల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా



ఖమ్మం జిల్లా, కారేపల్లి : జూన్ 21 : మండల కేంద్రంలో వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమం లో రాములు నాయక్ వీర అభిమానులు,సింగరేణి మండల ముఖ్య అనుచరులు పాల్గొని రాములు నాయక్ పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి, అభిమాన నాయకున్ని మనస్సులో స్మరించుకుంటూ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యదర్శి అజ్మీర వీరన్న , సూర్య తండా రాము నాయక్ , జరపల ప్రసాద్ ,గోవింద్ తండా కోటి ,రామ్ కిషోర్ నాయక్ ,కారేపల్లి ప్రముఖ వ్యాపారవేత్త పిల్లి వెంకటేశ్వర్లు ,పప్పుల నిర్మల ,కరణ్ సింగ్ ,జూపల్లి రాము,నాగరాజు ,తదితరులు పాల్గొన్నారు.

# నగర పాలక సంస్థలో సంపూర్ణంగా స్పెషల్ డ్రైవ్


డీసిల్టింగ్ పనులు 75శాతం పూర్తి

కమిషనర్ దిలీప్ కుమార్ వెల్లడి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 21 : వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్ ను ప్రారంభించడం జరిగిందని, ప్రతి రోజు సగటున రెండు నుండి మూడు డివిజన్లలో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఆయా డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే, నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని అన్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలోని సానిటేషన్ కార్మికులు సుమారు వంద మంది చొప్పున సామూహికంగా పారిశుధ్య పనులను చేపట్టడం వల్ల ఆయా డివిజన్లలో సానిటేషన్ పనులు పెద్ద ఎత్తున చేపట్టగలిగామని తెలిపారు. డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయడం, చెత్తను తరలించడం, పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలను శుభ్రం చేయడం వంటి పనులు అన్ని డివిజన్లలో పూర్తయ్యాయని అన్నారు. శుభ్రపరచిన మురుగును, చెత్తను నివాస ప్రాంతాల మధ్య నుండి వెంటదివెంట తరలించడం జరిగిందన్నారు. కలెక్టర్ చొరవతో పలు డివిజన్లలో శ్రమదానం కార్యక్రమాలు సైతం జరిగాయని అన్నారు. కాగా, వర్షాకాలంలో వర్షపు జలాలు నిలువ ఉండకుండా ఆయా నివాస ప్రాంతాలలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను కూడా వేగవంతంగా జరిపిస్తున్నామని కమిషనర్ తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు వర్షపు జలాలతో చెత్తాచెదారం మురుగు కాలువల్లోకి చేరి, పూడిక వల్ల ముందుకు వెళ్లే అవకాశం లేక నగరంలోని పలు ప్రాంతాలు, ప్రధాన రహదారులు అపరిశుభ్రంగా మారే అవకాశం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా డీసిల్టింగ్ పనులు చేయిస్తున్నామని అన్నారు. అవకాశం ఉన్న చోట జేసీబీల ద్వారా, మిగితా చోట్ల పారిశుధ్య కార్మికులతో పూడికతీత పనులు జరిపిస్తున్నామని తెలిపారు. ఐదు జోన్ల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల పొడవుతో కూడిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీలు ఉండగా, రూ. 68.96 లక్షల రూపాయల అంచనా వ్యయంతో డీసిల్టింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 17.22 కిలోమీటర్ల పొడవుతో కూడిన డ్రైనేజీల డీసిల్టింగ్ పూర్తయ్యిందని వివరించారు. మిగితా డీసిల్టింగ్ పనులను కూడా వారం పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

# జర్పలా అంకికీ నీవాళ్ళు అర్పించిన సర్పంచ్ హీరాలాల్



ఖమ్మం జిల్లా, కారేపల్లి :జూన్ 21 : మండలంలోని భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీ లోని 5 వ వార్డ్ కు చెందిన జర్పలా అంకి (70) వృద్యాప్య కారణాలవల్ల ఆదివారం నాడు మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ బానోత్ హీరాలాల్ అంకి పార్ధివదేహాన్ని సందర్శించి పూలమాలతో ఘనంగా నీవాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులకు ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపినాడు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ భిక్కులాల్ , వార్డ్ సభ్యులు సంధ్య , సందీప్ , సోమ్లా , గిరి ప్రసాద్ , లాలు , అంకి కుమారులు వీరన్న , నగేష్ , తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి బిడ్డ చదువుకు అండగా నిలబడ్డ కానా సంస్థ.




. నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.సల్లూరి ప్రియమణి పదవ తరగతిలో 570/600 మార్కులు సాధించి కూడా పై చదువులకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో , తన ఇంటర్ చదువు ప్రశ్నార్థకంగా ఉన్న సమయంలో ప్రభుత్వ టీచర్ దత్తు(డ్రిప్, కౌన్సిలర్ ) , బోటనీ లెక్చరర్ వీరబాబు కానా సంస్థ గురించి తెలుసుకొని సల్లూరి ప్రియమణి తండ్రి సత్తయ్య గౌడ్ విషయాన్ని కానా స్థానిక ప్రతినిధి గణేష్ నాతి దృష్టికి తీసుకురాగా , వెంటనే అమెరికాలో ఉన్న కానా సంస్థ వారు, 80 వేల రూపాయలు ఫీజు స్థానిక ప్రతినిధులు నాతి గణేష్,బాల్నే రామచంద్రుడు ద్వారాకట్టించి , విద్యార్థిని మొదటి సంవత్సరానికి చేయూతనిచ్చారు , విద్యార్థిని ప్రియమణి కూడా తనచదువును కొనసాగించి, మంచి ప్రతిభ కనబర్చి, ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా ఉంటానని బృందం సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కానా వారు, దత్తు , అల్ఫోర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ కేషవ్ ,సాయి క్రిష్ణ, వీరబాబు పాల్గొని, విద్యార్థిని మోటివేట్ చేయడం జరిగినది.ఎలాంటి సంబందం లేకున్న మానవత దృక్పధంతో ప్రియమణి చదువులకు ఆర్థిక సహాకారం చేసిన కానా సంస్థవారికి అల్ఫోర్స్ ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు

# నల్లగొండ పాతబస్తీ గౌడ సంఘం నూతన కమిటీ ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం.



నల్లగొండ జిల్లా ప్రతినిధి.నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం , నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమం గౌడ సంఘ భవనం వద్ద ఘనంగా నిర్వహించబడింది.గౌడ పెద్దలు బైరగోని రాజయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో గౌడ సంఘ కమిటీలను ఏర్పాటు చేసి గౌడ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ ముందుండాలని పిలుపునిచ్చారు.గౌడ పెద్దలు తండు సైదులు గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు .ఈ సందర్భంగా దివంగత కందుల యాదగిరి గౌడ్ స్మారకార్థం వారి సతీమణి శ్రీమతి కందుల నిర్మలమ్మ గౌడ్, కుమారులు బాలరాజు గౌడ్, రమణ గౌడ్లు గౌడ సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేటర్లు రేగట్టే అండాలు లింగస్వామి గౌడ్, గోపగోని స్వాతి రాజశేఖర్ గౌడ్, పాలకూరి సుమలత సంతోష్ గౌడ్లతో పాటు స్థానిక కార్పొరేటర్ గుండబోయిన పుష్పలత వెంకన్న యాదవ్ , అక్కనపల్లి రేవతి, బలరాం , మామిడి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ పెద్దలు పుల్లెంల యాదగిరి గౌడ్ సురిగి వెంకన్న గౌడ్ హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.నూతన కమిటీలో అధ్యక్షుడిగా పెద్దగోని సురేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోయపల్లి వెంకటేశ్వర్లు గౌడ్తో పాటు పుల్లెంల రాము గౌడ్, చెన్నగోని లింగస్వామి గౌడ్, బోయపల్లి మధు గౌడ్, కొమ్మగోని సతీష్ గౌడ్, ఐతగోని రమేష్ గౌడ్, వాయుల నాగరాజు గౌడ్, అనంతల యాదగిరి గౌడ్, ఐతగోని గణేష్ గౌడ్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యువకులు, గౌడ సంఘ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్-2026 పరీక్ష: కలెక్టర్ కె. హైమావతి

939 మందికి గాను 812 మంది హాజరు -

- రెండు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు



సిద్దిపేట, జూన్ 21: జిల్లాలో నీట్-2026 ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించారు.మొత్తం 939 మంది అభ్యర్థులకు గాను 812 మంది పరీక్షకు హాజరుకాగా, 127 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేసి, నిబంధనల ప్రకారం నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో నోడల్ అధికారులు, సీఆర్పీఎఫ్ బలగాలు మరియు పోలీసు భద్రతను పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు.జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, సిద్దిపేట జిల్లా.

# గరిట పట్టేద్దాం

వేసవి సెలవుల్లో పిల్లలకు బోలెడంత ఫ్రీ టైమ్ ఉంటుంది. చదువులకు మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలు పెంచుకునేందుకు మంచి అవకాశం. కుకింగ్, మనీ మేనేజ్‌మెంట్, క్రియేటివ్ ఆర్ట్స్, రీ సైక్లింగ్, ఫిజికల్ యాక్టివిటీస్, నేచర్ లైఫ్, గ్లోబల్ ఎక్స్‌పోజర్, వెల్‌బీయింగ్ క్లాసెస్, కమ్యూనికేషన్, డిజటల్ అండ్ టెక్నాలజీ స్కిల్స్.. ఇవన్నీ పాఠాలుగా కాకుండా వివిధ రకాల అంశాలలో అవగాహన కలిగించడానికి మేలైన సమయం. ఈ వేసవిలో పిల్లలకు వినోదాన్ని కూడా ఇచ్చే అంశాలపై నిపుణుల సూచనలతో వరుస కథనాలు. వేసవి సెలవుల్లో పిల్లలకు బోలెడంత ఫ్రీ టైమ్ ఉంటుంది. నచ్చిన ఆటలు, మెచ్చిన వినోదం.. వీటితోనే కాలక్షేపం చేయడం కాకుండా జీవన నైపుణ్యాలు పెంచుకునేందుకు మంచి అవకాశం కూడా. ఆ జాబితాలో ముందుగా వంటింట్లోకి తీసుకెళదాం. పిల్లలను కుదురుగా ఉంచేది, ఏకాగ్రతను పెంచేది, సహనాన్ని, టీమ్ వర్క్‌ని పరిచయం చేసే పాకశాస్త్రాన్ని పరిచయం చేద్దాం.. రోజూ అమ్మ చేసే వంటకు ఏదో వంక పెట్టే పిల్లలు ఉంటారు. ఒక వంట తయారు చేస్తే, మరోటి అడిగే వారూ ఉంటారు. ఇష్టమైనవన్నీ తయారుచేసి, సమయానికి బాక్స్ కట్టి ఇచ్చే అమ్మ పని తెలియాలంటే ఇదో చక్కని మార్గం కూడా. 'అమ్మో! వంటింటిని పిల్లలకు అప్పజెప్పడమా!' అని భయపడకుండా పిల్లల చేత గరిట పట్టిస్తే ఏమేం జరుగుతుందో తెలుసుకుందాం..




### రుచుల ఆస్వాదన

వంట పాత్రలు, అందుకు ఉపయోగించే వివిధ రకాల సాధనాలు ముందుగా పరిచయం అవుతాయి. ఆ తర్వాత వంట దినుసులు, కూరగాయలు, ఆకుకూరల పట్ల అవగాహన పెరుగుతుంది. వేటితో ఏ తరహా వంటకాలు తయారు చేయచ్చు, రుచులను కలపడం వంటి ప్రక్రియల్లో పాల్గొంటారు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను పెంచుతుంది. ఒక సాధారణ పదార్థాన్ని కొత్తగా ఎలా రూ?ందించవచ్చు, అనే ఆలోచన కూడా వారిలో అభివృద్ధి చెందుతుంది. దీంట్లో భాగంగా ఇటాలియన్ , జపనీస్, కొరియన్ వంటి అంతర్జాతీయ వంటకాలనూ పరిచయం చేయవచ్చు. దీనివల్ల పిల్లల్లో ప్రపంచ సంస్కృతులపై అవగాహన పెరుగుతుంది.

### ప్రోత్సాహంతో ఆత్మవిశ్వాసం

తాము తయారు చేసిన వంటకాన్ని కుటుంబ సభ్యులు రుచి చూసి, ప్రశంసిస్తే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్న వయసులోనే 'నేను చేయగలను' అనే భావన అలవాటు అవుతుంది. ఇంట పనుల్లో తాము భాగస్వాములు అవుతారు. వంట భారంగా కాకుండా సులభంగా చేసేలా ప్రోత్సహించవచ్చు.

### జట్టుగా విజయం

కుకింగ్ క్లాసులలో చేరితే పిల్లలు గ్రూప్స్‌గా పనిచేస్తారు. ఇది వారికి టీమ్‌వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను నేర్పిస్తుంది. ఇతరులతో కలిసి పని చేయడం, బాధ్యతలు పంచుకోవడం వంటి లక్షణాలు పెరుగుతాయి.

### సమతుల్యత సాధన

వంట సమయంలో చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి. వంటలో ఉపయోగించే పదార్థం తక్కువైతే ఎలా మార్చాలి, రుచిని ఎలా సర్దుబాటు చేయాలి... ఇవన్నీ పిల్లల్లో సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుతాయి. బ్యాలెన్స్ ఎంత అవసరమో తెలియజేస్తుంది.

### మంచి అలవాట్లు

ముఖ్యంగా వంట చేయడం ద్వారా పిల్లలు ఆహార విలువ తెలుసుకుంటారు. ఏ పదార్థం ఆరోగ్యానికి మంచిది, ఏయే పోషకాలు వేటి ద్వారా లభిస్తాయి,.. వంటి విషయాలు అర్థమవుతాయి. వృథాను అరికట్టడం, మిగిలిన పదార్థాలను తిరిగి ఎలా ఉపయోగించడం, శుభ్రతను ఎందుకు పాటించాలి.. వంటి విషయాల్లో అవగాహన కలుగుతుంది. దీంతో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఏర్పడతాయి.

### బాధ్యత పెరుగుతుంది

వంట చేయడం ద్వారా పిల్లలు స్వతంత్రంగా పని చేయడం నేర్చుకుంటారు. తమ పనిని తామే పూర్తి చేయడం, శుభ్రత పాటించడం వంటి బాధ్యతలు అలవాటు అవుతాయి. అంతేకాదు, వంట పనిలో భాగంగా వస్తువులను శుభ్రపరచడం, సర్దడం వంటి పనులూ నేర్చుకుంటారు. అదే సమయంలో గ్యాస్, ఎలక్ట్రిక్, కటర్స్.. వంటి వాడకంలో రక్షిత చర్యల గురించి అవగాహన కల్పించవచ్చు. ఇంట్లో వీలు కావడం లేదు అనుకునేవారు కుకింగ్ క్యాంప్స్‌లో చేర్పించవచ్చు. వంటల పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించవచ్చు. వంట ద్వారా కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమనూ, ఆనందాన్ని, రుచుల ఆస్వాదననూ పరిచయం చేయవచ్చు. ఇది పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది కూడా.

### వంట.. వ్యక్తిత్వ వికాస పాఠం

పిల్లలు వంట నేర్చుకోవడం ద్వారా ఒక సమగ్రమైన అవగాహన కలుగుతుంది. ఒక డిష్‌ను ఎలా ప్రెజెంట్ చేయాలో తెలుస్తుంది. ప్రతి వంటకం తయారీకి పట్టే సమయం వారిలో ఆలోచనాశక్తిని, సహనాన్ని పెంచుతుంది. జంక్ ఫుడ్ ఎందుకు తీసుకోవద్దో తెలుస్తుంది. వంట అంటే ఆడవాళ్లు మాత్రమే చేసేది కాదని కుటుంబంలో అందరూ చేయవచ్చని తెలుస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎందుకు తీసుకోవాలో తెలుస్తుంది. అయితే, వంట పని ఒక భారంగా కాకుండా వినోదాత్మకంగా మార్చగలిగితే పిల్లలు జాయ్‌ఫుల్‌గా రుచుల తయారీ పట్ల దృష్టి పెడతారు. ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లల చేత వంటను ఫన్‌గా చేయించవచ్చు. ఎక్కువ మంది పిల్లలతో కలిసి పాల్గొనేలా చేయాలంటే..అందుకు కిడ్స్ కుకింగ్ క్యాంప్స్ పిల్లలకు వినోదంతో పాటు విలువైన నైపుణ్యాలనూ నేర్పిస్తున్నాయి.

# 'కాల్పుల విరమణ'కు తూట్లు!



ప్రపంచమంతా ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూసిన కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాకుండానే ముగిసిపోయే ప్రమాదం కనబడుతోంది. తీవ్ర వైషమ్యాలతో కాలుదువ్వుకునే వైరిపక్షాలు యుద్ధ క్షేత్రాన్ని విడిచిపెట్టడం అంత సులభమేమీ కాదు. అందుకే ఒప్పందం కుదిరాక కూడా అక్కడక్కడ పరస్పర దాడులు తప్పవు. కానీ పశ్చిమాసియా పరిస్థితి కాస్త భిన్నమైనది. కాల్పుల విరమణపై తొలుత అమెరికా, ఆ తర్వాత ఇరాన్ ధ్రువీకరించాక, మధ్యవర్తి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సైతం ప్రకటన చేశారు. ఎప్పుడూ లేనిది ఇజ్రాయెల్ కూడా ఒప్పందాన్ని అంగీక రిస్తున్నట్టు తెలిపింది. కానీ 24 గంటలు గడవకుండానే అందరిదీ తలోమాట అయింది. మధ్యవర్తి పాత్ర పోషించే దేశం దృఢమైన స్వరం వినిపించగలగాలి. అవసరమైతే శాసించగలగాలి. కానీ అమెరికా అప్పులపై ఆధారపడే పాక్ ఆ పని చేయగలదా? ఘర్షణలు నివారించిన ఖ్యాతిని కూడా 'త్యాగం' చేసి, తెరవెనకుండి పాకిస్తాన్ ద్వారా కథ నడిపిస్తున్న చైనా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే అమెరికా, ఇజ్రాయెల్ ఈ మాదిరి డ్రామాలకు సాహసించేవి కాదు. అసలు పశ్చిమాసియాకు సంబంధించి ఏ ఒప్పందం కుదరాలన్నా అమెరికాను సంతృప్తిపరిస్తే సరిపోదు. ఆ దేశం ఒకటి కాదు... రెండు! అవిభాజ్య కవలల మాదిరిగా వ్యవహరిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ఒప్పుకుంటే తప్ప ఏదీ సాధ్యపడదు. ఒక్కోసారి ఆ రెండూ కావాలని భిన్న స్వరాలు వినిపిస్తాయి. దీన్ని వ్యూహం అనాలో, చవకబారు ఎత్తుగడగా భావించాలో ఎవరికీ తెలియదు. అమెరికా అవునంటుంది... కాసేపటికి ఇజ్రాయెల్ కాదంటుంది. పర్యవసానంగా అనుకున్నది అమలుకాక అవతలి పక్షం అయోమయంలో పడుతుంది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ పట్టాభిషేకమయ్యాక ఆయన అల్లుడు జేర్డ్ కుష్నెర్ ద్వారా ఇజ్రాయెల్‌కు చుట్టరికం కలవడంతో పట్టపగ్గా ల్లేకుండా పోయాయి. అందుకే వైట్‌హౌస్‌లో, ట్రంప్‌కు బాగా దగ్గరగావుండే వ్యక్తుల్లో కలకలం మొదలైంది. ఇప్పుడు తోకే కుక్కను ఆడిస్తోందన్న రీతిలో వ్యవహారం ముదిరింది. కనుకనే ఒప్పందంపై తొలుత ప్రకటించిన ట్రంప్ లెబనాన్‌పై దాడులు సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. అటు తర్వాత ఒప్పందంలో లెబనాన్ ప్రస్తావన లేదని బుకాయించటం మొదలుపెట్టారు. ఇరాన్ 10 అంశాల ముసాయిదా కొత్తదేమీ కాదు. దురాక్రమణకు ముందే ఇరాన్ దాన్ని ప్రతిపాదించింది. అప్పట్లో అది ట్రంప్‌కు నచ్చలేదు. ఇక ఇరాన్ ఎంతకూ లొంగకపోవటం, చమురు ధరలు ఆకాశాన్నంటడంతో కొంపమునుగుతుందని అర్థమై అది ఆచరణయోగ్యమేనని అంగీకరించక తప్పలేదు. తన కూటమిలోని ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయరాదంటున్న ట్రంప్... ఆ దేశానికి మద్దతుగా నిలబడిన లెబనాన్‌లో మాత్రం ఇజ్రాయెల్ ఊచకోత కొనసాగించటం సబబేనంటున్నారు. ఇది మర్కట తర్కం కాదా? కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఉత్సవం చేసుకుంటున్న జనంపై పది నిమిషాలపాటు ఏకధాటిగా సాగించిన కాల్పుల్లో 250 మందికిపైగా మరణించారు. మరో 1,000 మంది గాయపడ్డారు. కాల్పుల విరమణ ప్రకటించాక అంతవరకూ 119 డాలర్లుగావున్న బ్యారెల్ ముడి చమురు ధర 94 డాలర్లకు చేరింది. కానీ ఇజ్రాయెల్ హంతక దాడులతో అదికాస్తా మళ్లీ 97కు పెరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ కపట నాటకాలు కట్టిపెడితే తప్ప ప్రపంచం ప్రశాంతంగా మనుగడ సాగించలేదు. అది జరగాలంటే ఆ రెండు దేశాల్లోని ప్రజలతో పాటు ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి తీసుకురావాలి. ప్రపంచం సంక్షోభం అంచుల్లో ఉంది. ఇరాన్ ఇప్పటికే యుద్ధంవల్ల సమస్తం కోల్పోయింది. 3,000 మంది పౌరులు మరణించగా, లక్షలాది జనావాసాలు శిథిలాలుగా మారాయి. మౌలిక సదుపాయాలన్నీ ధ్వంస మయ్యాయి. ఇరాన్ శక్తిమేరకు ప్రతీకార దాడులు చేస్తూ దురాక్రమణకు దిగిన ఆ రెండు దేశాలతోపాటు, వాటికి సహకరిస్తున్న ఇరుగు పొరుగు దేశాలను సైతం దెబ్బతీయగలిగింది. పశ్చిమాసియాలో ఇంతకుమించి మరేం జరగకూడదనుకునే దేశాలు ఇక తటస్థ అవతారాలు చాలించి నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్ని లోటుపాట్లున్నా ఈ ఒప్పందం కొనసాగేలా చూడాలి. శుక్రవారం జరిగే చర్చలు ఫలవంతం కావాలి. లేనట్టయితే చరిత్ర క్షమించదు.

# ఈ మరక పోయేదెలా?



నిరుడు మార్చిలో కోట్లాది రూపాయల కరెన్సీ కట్టలు తగలబడిన ఉదంతంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొని, అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లిన ఢిల్లీ హైకోర్టు అప్పటి న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ శుక్రవారం ఎట్టకేలకు పదవి నుంచి తప్పుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రాజీనామాను ఆమోదిస్తే జస్టిస్ వర్మకు రిటైర్మెంట్ ప్రయోజ నాలు, పెన్షన్ యథావిధిగా వస్తాయి. ఈ ఉదంతం జరిగినప్పటి నుంచీ ఆయన వితండ వాదం చేశారు. కరెన్సీ కట్టలు కాలిన ఉదంతం జరిగింది న్యాయమూర్తుల నివాసప్రాంగణంలోని తన ఇంటికి వెలుపలవున్న స్టోర్ రూంలోననీ, అందరూ వచ్చిపోయే చోట ఉన్న సొమ్ము తనదేనని ఎలా చెబుతారనీ ప్రశ్నించారు. రాజీనామా చేసి నిష్క్రమించటం ఉత్తమమని సహచర న్యాయమూర్తులు చెప్పినా ఆయన అంగీకరించలేదు. అభిశంసన వరకూ వెళ్తే ఆయనతోపాటు మొత్తం న్యాయవ్యవస్థపైనే చర్చ జరుగుతుందనీ, ఇది వ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలపై ప్రభావం చూపుతుందనీ చెప్పినా ఆయన తలకెక్కలేదు. పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ మొదలైన దశలో జస్టిస్ వర్మ రాజీనామా చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలనదగ్గ మూడు వ్యవస్థలు – – కార్యనిర్వాహకవర్గం, శాసనవ్యవస్థ, న్యాయవ్యవస్థలు సమానమైనవని చెబుతారు. కానీ మన రాజ్యాంగం న్యాయవ్యవస్థకు మాత్రమే ఆ మూడింటి పరిధులనూ నిర్ణయించగల అధికారాన్నిచ్చింది. తనకు దఖలుపరిచిన బరువుబాధ్యతలకు తగ్గట్టుగా న్యాయవ్యవస్థ ఉండటంలేదన్న విమర్శలు, ఆరోపణలు చాన్నాళ్ల నుంచి ఉన్నాయి. అవి కేవలం బయటి నుంచి మాత్రమే కాదు... లోపలి నుంచీ వస్తున్నాయి. మొన్న ఫిబ్రవరి నెలాఖరున లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ జవాబిస్తూ గత పదేళ్ల కాలంలో సిట్టింగ్ జడ్జీలపై సుప్రీంకోర్టుకు 8,630 ఫిర్యాదులందాయని తెలిపింది. కానీ అతి స్వల్ప కేసుల్లో మాత్రమే అంతర్గత కమిటీల ద్వారా విచారణలు జరిగాయి. తీవ్ర ఆరోపణలొచ్చిన కేసుల్లో అనేకం కనీసం నామమాత్ర విచారణ వరకూ పోలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆరేళ్ల క్రితం కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా అప్పటి అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, న్యాయవ్యవస్థలోని అవినీతిపై గతంలో తొమ్మిదిమంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాట్లాడారనీ, వారిలో సర్వీసులో ఉండగా మాట్లాడినవారు ఇద్దరనీ ధర్మాసనానికి చెప్పారు. డబ్బు తీసుకోవటం ఒక్కటే అవినీతి అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ ఆశ్రిత పక్షపాతం, హోదా దుర్వినియోగం, విచక్షణాయుత అధికారాన్ని స్వప్రయో జనాలకు వినియోగించుకోవటం వగైరాలు సైతం దాని కిందికే వస్తాయి. రైతులకు రావాల్సిన బ్యాంకు రుణాలను ఒక చక్కెర కర్మాగారం దారిమళ్లించి సొంతానికి వాడు కున్న కేసులో 2010లో సీబీఐ దర్యాప్తు చేసి ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసినప్పుడు అందులో జస్టిస్ వర్మ ఆ సంస్థ నాన్--ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదో నిందితుడిగా ఉన్నారు. తర్వాత కాలంలో ఆ కేసు ముందుకు సాగలేదు. ఆయనపైనా చర్యలు లేకుండా పోయాయి. ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ విశ్వహిందూ పరిషత్ సదస్సుకు పోయి మతతత్వ వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలనీ, వివరణ ఇవ్వాలనీ సుప్రీంకోర్టు కొలీజియం తీర్మానించింది. కానీ అవేమీ జరగలేదు. గతంలో అరడజను మంది న్యాయమూర్తులపై ఆరోపణ లొచ్చాయి. వారిలో ఒకరిద్దరిపై అభిశంసన వరకూ వెళ్లింది.ఎ విధాన సంబంధమైనసంక్లిష్టతల వల్ల ఆ ప్రక్రియ వీగిపోయింది. కొందరు తమంత తామే రాజీనామా చేసి వెళ్లటంతో నిలిచిపోయాయి. ఇలాంటి ఉదంతాలన్నీ న్యాయవ్యవస్థ పనితీరును ప్రశ్నార్థకం చేస్తాయి. తీర్పునిచ్చే స్థానంలో ఉండటం వల్ల న్యాయమూర్తులపై దురుద్దేశంతో ఆరోపణలు చేసేవారు కూడా ఉంటారు. ఆ బెడద నుంచి వారిని కాపాడటానికి కట్టుదిట్టమైన చట్టాలు అవసరమే. కానీ అవినీతిపరులకు అవి కవచంగా ఉపయోగపడే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఫిర్యాదులను స్వీకరించి, దర్యాప్తు చేయించి నిజా నిజాలను నిర్ధారించటానికి సర్వస్వతంత్రమైన వ్యవస్థ ఒకటి అవసరం. ఆ దిశగా ప్రయత్నిస్తేనే అవినీతి జాడ్యం అంతమవుతుంది.

# డీలిమిటేషన్ పై సవరణను వ్యతిరేకిస్తూ నల్లజెండాలు ఎగరవేయాలి




చెన్నై : నియోజకవర్గాల పునర్విభజనపై ప్రతిపాదిత సవరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు నల్ల జెండాలను ఎగరవేయాలని కోరారు. ఈ సవరణను –నల్ల చట్టం', –కుట్ర'గా ఆయన అభివర్ణించారు. "పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలను ఎగరవేస్తాము. భారతదేశాన్ని తిరోగమన దిశగా నడిపిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా నల్లజెండాలు ఎగరవేయండి" అని అన్నారు. పార్టీ ఎంపిలు, జిల్లా కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు, ఢిల్లీల మధ్య పోరేనన్న తన వాదనను బిజెపి రుజువుచేస్తోందని మండిపడ్డారు. తమ ప్రకటనలోని వాస్తవాన్ని బిజెపి గ్రహించిందని, తమిళనాడు అభివృద్ధి చెందడాన్ని గాని, పార్లమెంటులో తమిళనాడు ప్రతినిధుల గొంతుకను వినిపించడాన్ని గానీ బిజెపి కోరుకోవడం లేదని అన్నారు. ఈ కుట్రకు రూపమిచ్చేందుకే సవరణను ప్రవేశపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రను చట్టంగా తామెలా అంగీకరించగలమని కేంద్రాన్ని ప్రశ్నించారు. డీలిమిటేషన్ కేవలం జనాభా ఆధారంగా జరగకూడదని, ఈ నల్ల చట్టాన్ని అమలు చేయకూడదని పునరుద్ఘాటించారు. ఇది ఎనిమిది కోట్ల తమిళుల ఏకైక డిమాండ్ అని అన్నారు. రాజకీయ అడ్డంకులను అధిగమించి, రాష్ట్ర హక్కుల కోసం గళం విప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. –తమిళనాడు పోరాడి గెలుస్తుంది. మనం ఐక్యంగా గెలుద్దాం ' అని అన్నారు. ప్రధాని మోడీ దక్షిణాది రాష్ట్రాలను , అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులస్థాయికి దిగజార్చారని మండిపడ్డారు. జనాభాను నియంత్రించినందుకు ఇది శిక్షా అని ప్రశ్నించారు. తాము దేశ సంక్షేమం, ఐక్యత కోసం నిలబడ్డామని, తమ రాజకీయ హక్కులను లాక్కుంటున్నారని, ఇంతకంటే క్రూరమైనది మరొకటి లేదని అన్నారు. మోడీ ప్రభుత్వ సవరణ ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే ఎంపిల సంఖ్యలో అసమానతను సృష్టిస్తుందని అన్నారు. డీలిమిటేషన్ పేరుతో మోడీ ప్రభుత్వం హద్దులు దాటి, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల అధికారాలను తగ్గించి, ఉత్తరాది రాష్ట్రాలకు మరింతగా అధికారాన్ని కట్టబెడితే తమిళనాడు రాష్ట్రం చూస్తూ ఊరుకోదని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతుందని అన్నారు.

# ఇరాన్‌పై బలప్రయోగం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది : ఇరాన్ అధ్యక్షుడు



టెహ్రాన్ : ఇరాన్‌ను బలవంతంగా లొంగదీసుకోవాలని చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది అని బుధవారం ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరించారు. తాజాగా పాకిస్తాన్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమవ్వడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహావేశంతో హార్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ప్రకటించాడు. అనుకున్నట్టుగానే ఇరాన్ పోర్టులకి వెళ్లే నౌకల్ని అమెరికా సైన్యం అడ్డుకుంది. ఈ తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందించారు. ఇరాన్‌పై బలప్రయోగం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని ఆయన హెచ్చరించారు. 'మేము నిర్మాణాత్మక చర్చలకే ప్రాధాన్యత ఇస్తాము. ఇరాన్‌ను లొంగిపోయేలా బలవంతం చేసే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుంది. ప్రజలు అటువంటి విధానాన్ని ఎన్నటికీ అంగీకరించరు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు అని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఎస్ఎన్ఎకి ఆయన వెల్లడించారు. కాగా, ఏ అధికారంతో, ఏ నేరానికి పాల్పడి మా దేశంపై దాడి జరిగింది. అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించి పౌరులను, ఉన్నత వర్గాలను, పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం, పాఠశాలలు, ఆసుపత్రులతో సహా కీలక కేంద్రాలను ధ్వంసం చేయడాన్ని అమెరికా ఎలా సమర్థించుకుంటుంది అని ఆయన మీడియా ద్వారా ప్రశ్నించారు. తమ దేశం శాంతిని, దౌత్య సంబంధాలను కోరుకుంటుంది. అయితే దాని సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఎలాంటి బాహ్య దురాక్రమణనైనా లేదా ఒత్తిడినైనా గట్టిగా ప్రతిఘటిస్తుందని ఇరాన్ అధ్యక్షుడు పునరుద్ఘాటించారు.

# మార్చి నెలలో రికార్డు స్థాయిలో ఎగుమతులు



న్యూఢిల్లీ : 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎగుమతులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. వస్తువులు, సేవల సంయుక్త ఎగుమతులు తొలిసారిగా 860 బిలియన్ డాలర్ల మార్కును దాటాయి. ఈ ఎగుమతులతో భారత్ ప్రపంచ వాణిజ్యంలో నిరంతర పురోగతిని, బలమైన పట్టుని సాధిస్తున్నట్లు సూచిస్తుంది. కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. గతేడాది 2025లో 825.26 బిలియన్ల మేర ఎగుమతులు జరిగితే.. ఈ ఏడాది 2026 ఏప్రిల్– మార్చి నెలల కాలంలో వస్తువులు, సేవల మొత్తం ఎగుమతులు 860.09 బిలియన్లకు పెరిగాయి. ఇది గతేడాది కంటే ఈ ఏడాది 4.22 శాతం మేర ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులలో ఈ ఏడాది సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం తెలిపింది. కాగా, ఈ ఏడాది వస్తువుల ఎగుమతులు 441.78 బిలియన్లకు చేరుకున్నాయి. ఇది మునుపటి ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 437.70. మొత్తంగా 0.93 శాతం పెరుగుదల ఉంది.ఎ

# కళ్లు మూసుకొని తెరిచేలోపు మన ప్రభుత్వం వస్తుంది



అమరావతి : " రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోంది.. దేవుడు అన్ని చూస్తున్నాడు.. కళ్లు మూసుకుని తెరిచేలోపు మన ప్రభుత్వం వస్తుంది " అని వైసిపి అధినేత వైఎస్. జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వైఎస్ జగన్ పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ... తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్లతో మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కృషి చేశామన్నారు. అన్ని రకాల అనుమతులతో పోర్టులను ప్రారంభించామని పేర్కొన్నారు. 2024 మార్చి 12న జువ్వలదిన్నెను వర్చువల్‌గా ప్రారంభించామని జగన్ చెప్పారు. 1250 మెకానైజ్డ్ బోట్లు అందించాలని అనుకున్నామని.. మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ బోట్లు మత్స్యకారులకు అందేవే అని చెప్పారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు కూడా 35 శాతం పూర్తి చేశామని తెలిపారు. కాకినాడ పోర్టు పనులు కూడా వేగవంతం చేశామని అన్నారు. రామాయపట్నం పోర్టు పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఏపీ ఎకనామిక్ గ్రోత్‌కు ఊతం ఇచ్చేలా ప్రణాళికలు చేశామని వివరించారు. మరి మిగిలిన పనులను కూటమి సర్కార్ ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యి రెండేళ్లు అవుతుందని.. ప్రధాని జాతికి అంకితమిచ్చి ఏడాదిన్నరకు పైగా అవుతుందని.. అయినా మత్స్యకారులు ఎందుకు అప్పగించలేదని నిలదీశారు. మత్స్యకారుల గురించి చంద్రాబు ఏనాడూ ఆలోచించలేదని జగన్ విమర్శించారు. మత్స్యకారులకు మేలు చేయకపోగా.. వారి పొట్టపై కంతున్నారని తెలిపారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మార్చి 12న మంత్రి లోకేష్ జువ్వలదిన్నెను సందర్శిస్తే.. 16న సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని తెలిపారు. బోట్లు ఎత్తుకెళ్లిన కేసులో ఒక్కరినైనా అరెస్టు చేశారా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న పెద్దలే దొంగతనం చేశారు కాబట్టే ఎవర్ని అరెస్టు చేయలేదని ఆరోపించారు. కళ్లు మూసి తెరిచేలోగా మూడేళ్లు గడిచిపోతాయని.. ఆ తర్వాత వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని జగన్ తెలిపారు. అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. జువ్వలదిన్నె మాత్రమే కాదు 10 ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల సొంతమని తెలిపారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని.. హార్బర్లను మత్స్యకారుల నుంచి ఎవరూ తీయలేరని వైఎస్.జగన్ స్పష్టం చేశారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కు మరో అసంతృప్తి సెగ



బెంగళూరు : మంత్రి రామలింగా రెడ్డి వ్యవహారం నుండి గట్టెక్కారనుకున్న తరుణంలోనే .. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కి మరో అసంతృప్తి సెగ ఎదురైంది. శాఖల కేటాయింపుపై అసంతృప్తితో ఉన్న ఇద్దరు నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో చర్చల కోసం ఢిల్లీకి బయలుదేరినట్లు తెలుస్తోంది. కృష్ణబేరె గౌడకు గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయించారు. అయితే, ఆ శాఖలోని బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బిడిఎ), బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (బిఎంఆర్ డిఎ) వంటి కీలక విభాగాలను మాత్రం సిఎం తన వద్దే ఉంచుకున్నారు. దీనిపై కృష్ణ బేరె అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ సమస్య పూర్తిగా పరిష్కారమైన తర్వాతే ఆ శాఖ బాధ్యతలు చేపడతానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో ఆయన భేటీ కానున్నారు. గౌడతో పాటు ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ కూడా ఢిల్లీ వెళ్లినట్లు సమాచారం. ఇటీవల నగరాభివృద్ధి శాఖను కేటాయించడంపై రామలింగారెడ్డి అలకబూనిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ నగరాభివృద్ధి శాఖ పైనే కృష్ణ బేరె అసంతృప్తిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సోమవారం మాజీ మంత్రులు జగదీష్ షెట్టర్, డి.వి. సదానంద గౌడలతో సమావేశమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సీనియర్ నాయకులతో చర్చలు జరిపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.


## కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం

### కేంద్ర మంత్రి కుమారస్వామి




విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఆర్అండ్ఎల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాద స్థలాన్ని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ భరత్, హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కుమారస్వామి, ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు చట్టబద్ధంగా వచ్చే బీమా, పీఎఫ్, గ్రాట్యుటీ ప్రయోజనాలకు అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగంతో పాటు వారి పిల్లలకు పూర్తి ఉచిత విద్యా సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. బాధితులు ప్రస్తుతం నివసిస్తున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే కొనసాగేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా విచారం వ్యక్తం చేస్తూ, పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారని మంత్రి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఇతర ఉక్కు కర్మాగారాల నిపుణులతో ప్రత్యేక విచారణ కమిటీని నియమించామని, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పిస్తారని పేర్కొన్నారు.

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. మండుతున్న ఎండలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణం నెలకొననుంది. ఒకవైపు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వానలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడవద్దని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు జిల్లాలలో మాత్రం భానుడి ప్రతాపం కొనసాగనుందని తెలిపారు. అక్కడ గరిష్టంగా 42కీజ నుంచి 43కీజ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖ సహా పలు కోస్తా జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## దుబాయ్‌లో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం



దుబాయ్‌లో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం పాలవగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సాంకేతిక లోపం కారణంగా రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఒక ట్రక్కును, కార్మికులతో వెళ్తున్న మినీబస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రక్కు అకస్మాత్తుగా ఆగడం, అదే సమయంలో మినీబస్సు డ్రైవర్ వెనుక ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయపడిన తొమ్మిది మందిని స్థానిక ఆస్పత్రికి తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. భారత అధికారులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ స్థానిక అధికారుల సహాయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

# గాడ్జిల్లా వచ్చేస్తోంది! భారత్‌పై దాని నీడ పడితే..



పశ్చిమాసియా సంక్షోభంలో సంయమనం పాటించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే కోరుతున్నారు. కానీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తన దారి తనదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. లెబనాన్ రాజధాని బీరూట్‌పై దాడులతో మళ్లీ యుద్ధాన్ని మొదలుపెట్టినంత పని చేశారు. ఇది శాంతి ప్రయత్నాల్లో ఉన్న ట్రంప్‌నకు సాధారణంగానే చిర్రెత్తుకొచ్చేలా చేసింది. ఒకవైపు తాను కాల్పుల విరమణ కోరుతూ ఇరాన్‌తో ఒప్పందం కోసం ప్రయత్నిస్తుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని మాత్రం కవ్వింపు చర్యలకు దిగడాన్ని ట్రంప్ ఏమాత్రం తట్టుకోలేకపోతున్నారు. ఈ మధ్య కాలంలోనే వీళ్లిద్దరి మధ్య వాడివేడి సంభాషణలు జరిగినట్లు.. అందులో ట్రంప్ నెతన్యాహును చెడామడా వాయించినట్లు అమెరికా మీడియా వరుసబెట్టి కథనాలు ఇస్తోంది. అయితే ఇజ్రాయెల్ మాత్రం ఆ స్థాయిలో తిట్టనేలేదని.. సున్నితంగా మందలించారనే అంటోంది. ఈ క్రమంలో మంచి స్నేహాన్ని చెడగొట్టుకుంటూ.. 'ఒంటరి అయిపోతావ్ జాగ్రత్త!' అని హెచ్చరించేదాకా నెతన్యాహు ఎందుకు తెచ్చుకుంటున్నారు అనేది పరిశీలిస్తే.. ఇరాన్‌పై మరోసారి దాడులకు ఆదేశించడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పైకి చూస్తే ఇది కేవలం హెజ్బొల్లా కోసమో, ప్రతీకారం కోసమో చేసిన దాడిలా కనిపించినా.. అసలు లక్ష్యం మాత్రం వేరే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్‌కు ప్రాధాన్యం దక్కేలా ఒత్తిడి తీసుకురావడమేనని చెబుతున్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. దీంతో ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత తొలిసారిగా ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లయ్యింది. అయితే ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు తాత్కాలికంగా కాల్పులు నిలిపివేశాయి. ప్రస్తుతం అమెరికా, ఇరాన్‌తో శాంతి ఒప్పందం కోసం చర్చలు జరుపుతోంది. కానీ, ఆ చర్చల నుంచి ఇజ్రాయెల్‌ను తొలి నుంచే దూరంగా ఉంచినట్లు.. ట్రంప్ వ్యవహార శైలిని బట్టి ఇట్టే అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో "మా ప్రయోజనాలను పట్టించుకోకుండా ఎలాంటి తుది ఒప్పందమూ సాధ్యం కాదు" అనే సంకేతాన్ని వాషింగ్టన్‌కు పంపేందుకే నెతన్యాహు ఈ పరిమిత దాడులకు ఆదేశించి ఉంటారని చర్చ నడుస్తోంది. ఇది మాత్రమే కాదు. ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అంశం.. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై దాడులు జరిపే స్వేచ్ఛ. ఒకవేళ భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదిరితే.. ఆ సైనిక చర్యలకు అవకాశమే ఉండకపోవచ్చు అని ఇజ్రాయెల్ భావిస్తోంది. అందుకే ఇరాన్ దాడులకు నేరుగా ప్రతిస్పందించి, "లెబనాన్‌లో మా చర్యలకు ఇరాన్ జోక్యం అంగీకరించం" అనే గట్టి సందేశాన్ని పంపింది. ఇక.. కాల్పుల విరమణ నేపథ్యంలో ట్రంప్, నెతన్యాహూ మధ్య విభేదాలు కొంతకాలంగా బయటపడుతున్నాయి. గత వారం బీరూట్‌పై జరగాల్సిన వైమానిక దాడులను ట్రంప్ ఫోన్ చేయడంతో నెతన్యాహూ నిలిపివేశారు. శాంతి చర్చలు దెబ్బతినకుండా ఉండాలన్నదే ట్రంప్ ఉద్దేశం. అయితే ఇజ్రాయెల్‌లో ప్రతిపక్షాలు మాత్రం "అమెరికా చర్చల కోసం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారా?" అంటూ నెతన్యాహూపై విమర్శలు గుప్పిస్తున్నాయి. స్వదేశం నుంచి ఈ ఒత్తిళ్లు కూడా నెతన్యాహును దాడులకు ఆదేశించి ఉండొచ్చన్న వాదన ఒకటి వినిపిస్తోంది. సైనిక నిపుణులు చెబుతోంది ఏంటంటే.. ఇజ్రాయెల్ ఒంటరిగా ఇరాన్‌పై దాడులు చేయగలిగినా దీర్ఘకాలిక యుద్ధాన్ని కొనసాగించే సీన్ మాత్రం లేదు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రక్షణ వ్యవస్థల కోసం అమెరికా సహకారం కీలకం. అందువల్ల ట్రంప్‌తో పూర్తిగా విభేదించే పరిస్థితి కూడా ఇజ్రాయెల్‌కు లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్‌పై తాజా దాడులు కేవలం సైనిక చర్యలు మాత్రమే కాదు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్ ప్రయోజనాలను విస్మరించవద్దనే రాజకీయ హెచ్చరికగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ట్రంప్ శాంతి ప్రయత్నాలు, నెతన్యాహూ భద్రతా ఆందోళనల మధ్య ఈ సమీకరణం భవిష్యత్తులో మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టీఎంసీ అంతర్విస్ఫోటనం!




ఎన్నికల ఫలితాలు వెలువడి పట్టుమని పాతిక రోజులు కాకుండానే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)కి వీధుల్లో హింసతో మొదలైన ఎదురుదెబ్బలు ఇంకా ఆగలేదు. తాజాగా ఇండియా కూటమి సమావేశానికి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఢిల్లీ వచ్చిన సోమవారం నాడే ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేసి, తమదే అసలైన టీఎంసీ అనీ, ఎన్డీయేలో ఉంటామనీ స్పీకర్‌కు లేఖ రాశారు. వారి సంఖ్య 13 మాత్రమేనని పార్టీ చెబుతోంది. ఇప్పటికే టీఎంసీ శాసనసభా పక్షం చీలి, 58 మంది ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ నాయకత్వంలో వేరు కుంపటి పెట్టారు. తమనే ప్రధాన ప్రతి పక్షంగా గుర్తించమని స్పీకర్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో రాజీనామాలకూ, గోడ దూకుళ్లకూ కొదవే లేదు. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న మమత ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నించకపోలేదు. కానీ అదేమీ ఫలితమివ్వలేదని తాజా పరిణామాలు చెబు తున్నాయి. ఫిరాయింపులనగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'వైస్రాయ్ ఎపిసోడ్' అందరికీ గుర్తొస్తుంది. కానీ ఆ జాఢ్యం 'వైస్రాయ్' కన్నా చాలా పాతది. 1967లో హరియాణాలో గయాలాల్ అనే స్వతంత్ర శాసనసభ్యుడు వారం రోజుల వ్యవధిలో మూడు పార్టీలు మారినప్పుడు 'ఆయా రాం... గయారాం' అనే నానుడి మొదలైంది. ఫిరాయింపులకు ఆయన ఆద్యుడు కాకపోవచ్చుగానీ, వాటితో ఆయన పేరు శాశ్వతంగా ముడిపడి పోయింది. కానీ గత రెండు దశాబ్దాలనుంచి గుంపుగా వెళ్లి అవతలి పార్టీతో అంటకాగే ఉదంతాలు లేదా సొంత పార్టీ పెట్టుకోవడం వంటివి చోటుచేసుకున్నప్పుడల్లా... ప్రభుత్వాలు కుప్ప కూలినప్పుడల్లా ఆ పాత నానుడి పోయి, 'వైస్రాయ్ ఎపిసోడ్' గుర్తుకురావటం మొదలైంది. 1995లో జరిగిన ఆ ఉదంతం వెన్నుపోటుకూ, విద్రోహా నికీ, నయవంచనకూ బండగుర్తుగా మారిపోయింది. తన మామ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనలో ఉండగా, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, అప్పటి రెవెన్యూ మంత్రి చంద్రబాబు తన విధేయులైన అరడజను మంది ఎమ్మెల్యేలను వైస్రాయ్ హోటల్‌లో పోగేసి, టీడీపీ చీలిపోయిందంటూ బ్రహ్మాండం బద్దలయిన స్థాయిలో అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుని, ఎమ్మెల్యేలను మభ్యపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఆయన మిత్రుడు, నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు సరేసరి... సకల వ్యవస్థలూ చంద్రబాబుకు సాగిలపడటంతో ఎన్టీఆర్ అధికారాన్ని కోల్పోయారు. కొన్ని నెలల వ్యవధిలోనే మనోవ్యథతో కన్ను మూశారు. ఇప్పటి 'రెడ్‌బుక్'లా ఆ ఉదంతానికి బాబు పేరెట్టినట్టు లేరుగానీ... ఈనాటికీ సకల రాష్ట్రాల ఫిరాయింపుదార్లకూ అదే శిరోధార్యం. 2014లో 23 మంది ఎమ్మెల్యేలను ఖరీదు చేయటం సంగతలా ఉంచి... 2024లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారం నుంచి వైదొలగాక కొందరు ఎంపీలతో పార్టీకీ, పదవికీ రాజీనామాలు చేయించటంద్వారా మళ్లీ ఆయనే 'నైతికత' ముసుగులో కొత్త రకం చీడకు గేట్లు తెరిచారు. మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపులతో శివసేన, ఎన్సీపీలు చతికిలబడి అప్పటి మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. ఇప్పుడు విపక్షంలో ఉన్నా టీఎంసీకి అదే దుఃస్థితి ఎదురైంది. ఇదంతా మమత స్వీయ తప్పిదాల ఫలితమా... బీజేపీ చూపే ఆకర్షణల వల్లనా అని చర్చించటం వృథా. రెండూ నిజమే కావొచ్చు. కానీ మమత తప్పిదాలుంటే అవి ఇప్పుడే గుర్తుకురావటం, బీజేపీ ఆకర్షణలు చూపితే పార్టీ అధికారం కోల్పోయాకే ఎగబడటం వింత. గత నెల 4న వెలువడ్డ ఫలితాల్లో 45.92 శాతం ఓట్లతో, 208 సీట్లతో బీజేపీ అధికారంలోకి రాగా... 40.68 శాతం ఓట్లు, 80 సీట్లతో తృణమూల్ అధికారం కోల్పోయింది. అంటే ఓట్లపరంగా పెద్ద వ్యత్యాసం లేదు. కానీ టీఎంసీ ఎమ్మె ల్యేలూ, ఎంపీల్లో ఎంత అభద్రతాభావం! ఈ బాపతు ఫిరాయింపుల్ని అలా గోడదూకే వారిలో లోపించిన నైతికతగా మాత్రమే చూడటం సరికాదు. ఈ వికృత ధోరణుల్ని నిలదీసే కాలంపోయి... ఘనకార్యాలుగా, 'అపర చాణక్యం'గా అభివర్ణించే మీడియా వచ్చింది. ఇతర వ్యవస్థలూ తమకేమీ తెలియనట్టు నటిస్తున్నాయి. అందుకే ఈ గోడ దూకుళ్లు నిర్లజ్జగా సాగిపోతున్నాయి. కనుక పార్టీలు చీలిపోతే... ప్రభుత్వాలు పడిపోతే 'యూ టూ బ్రూటస్' అనుకుని ఆశ్చర్యపోవటం తప్ప ఎవరూ చేయగలిగింది లేదు.

# మరో ఆర్థిక అరాచకం




ఆర్థిక కుంభకోణాలు ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా జీవితం ఈ సినిమాకు కథా వస్తువు. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబి) స్వయంగా 109 పేజీల నివేదికతో గురువారం బహిర్గతం చేసింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేదు. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. కార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలా కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. మోడీ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి భారత్‌పై వాణిజ్య దాడిగా కుహనా జాతీయవాదాన్ని లేపి అదానీపై ఈగ వాలకుండా చూసుకుంది. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఆ విధానాలను మోడీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుంది. స్కాంలు అనివార్యం. 'లక్కీ భాస్కర్లు' పుట్టుకొస్తూనే ఉంటారు. నష్టపోయేది సామాన్య ప్రజలే! అప్రమత్తం వహించాల్సింది ప్రజలే!!

# నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

## ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు


కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! "టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒకట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడిఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది" అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పనిచేసే లిథియం--అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. "ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ--వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు" అని ఈ--వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం--



అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. "భారత్ ప్రస్తుతం ఈ--వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ--వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సదీ?వనియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ తొలగుతుంది" అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

# మనోవేదనను 'మెషీన్' చెప్పేస్తుంది

### వాయిస్ శాంపిల్స్‌ను చిటికెలో విశ్లేషించి ముందే అప్రమత్తం చేస్తున్న మెషీన్ లెర్నింగ్ మోడల్స్
### తొలిదశలోనే మనోవ్యాధి లక్షణాలను పసిగట్టడంలో దోహదపడుతున్న సాంకేతికత
### తాజా ప్రయోగాల్లో 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో ఫలితాలు
### ఢిల్లీ ఎయిమ్స్ చేపట్టినపరిశోధనలో 78 శాతం కచ్చితత్వం నమోదు



ఒకరు చెబుతున్నది నిజమో లేక అబద్ధమో లై డిటెక్టర్ టెస్ట్ చిటికెలో చెప్పేస్తుంది. నాడీ స్పందనలు, బీపీలో హెచ్చుతగ్గులు, శ్వాస తీసుకోవడంలో మార్పులను విశ్లేషించి ఆయా అంశాలను నిర్ధారిస్తుంది. అదే తరహాలో డిప్రెషన్‌ను కేవలం ఒక్క వాయిస్ శాంపిల్‌తో మెషీన్ లెర్నింగ్ చాలా వరకు కచ్చితత్వంతో తొలిదశలోనే గుర్తిస్తోంది! ఈ మేరకు సాగిన అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. సంప్రదాయ చికిత్సా పద్ధతుల్లో డిప్రెషన్‌ను నిర్ధారించేందుకు వైద్యులు రోగులను కొన్ని ప్రశ్నలడిగి వారి భావోద్వేగ పరిస్థితులను అంచనా వేస్తుంటారు. అయితే ఈ పద్ధతిలో బాధితులు వారంతట వారుగా ముందుకొస్తే తప్ప వైద్య సాయం చేసేందుకు వీలు ఉండదు. దీనివల్ల చాలా సందర్భాల్లో బాధితులకు వైద్య సహాయం ఆలస్యం అవుతోంది. కానీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ సాంకేతికతను తెరపైకి తెచ్చారు. కుంగుబాటుకు గురైన వారి స్వరంలో హెచ్చుతగ్గులను మెషీన్ లెర్నింగ్ అల్గోరిథంల సాయంతో విశ్లేషిస్తున్నారు. కేవలం వాట్సాప్ ఆడియో ఫైల్స్‌ను విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ బాధితుల లక్షణాలను 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో మెషీన్ లెర్నింగ్ టూల్స్ గుర్తిస్తున్నట్లు ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. 25--30 సెకన్ల ఆడియో ఫైల్‌లోని స్వరంలో హెచ్చుతగ్గులు, వాల్యూమ్, స్పీచ్ రేట్ వంటి శబ్ద లక్షణాలను విశ్లేషించడం ద్వారా ఆయా వ్యక్తుల మనోవ్యథను మెషీన్ లెర్నింగ్ మోడల్స్ గుర్తిస్తున్నట్లు చెబుతున్నారు.

### ఎయిమ్స్‌పరిశోధన ఇలా...

డిప్రెషన్‌ను ముందుగానే గుర్తించడానికి స్పీచ్ అనాలిసిస్ ఒక ఆచరణాత్మక సాధనంగా ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధన నిర్వహించింది. ఇందులో భాగంగా పరిశోధకులు 423 మంది వాలంటీర్ల నుంచి (ప్రధానంగా 18--25 సంవత్సరాల ఏళ్ల వారు) సంతోషం, బాధలో ఉన్నప్పుడు మాట్లాడిన స్వర నమూనాలను సేకరించి విశ్లేషించారు. ఈ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు వారి క్లినికల్ మానసిక ఆరోగ్య స్థితిని నిర్ధారించుకోవడానికి ప్రామాణిక మానసిక పరీక్షలను కూడా చేయించుకున్నారు. ఈ అధ్యయనంలో వారి స్వరం, స్వర స్థాయి, స్వర శక్తితో సహా వాక్పటిమ, ఉచ్ఛారణ, ఇతర గుర్తులపై పరిశోధకులు దృష్టి సారించారు. దీనిప్రకారం నిరాశతో మాట్లాడిన సందర్భాల్లో వాక్పటిమ, భావోద్వేగ స్వరం, తక్కువ స్వర స్థాయిలను గమనించారు. అలాగే వాయిస్ విశ్లేషణను క్లినికల్ డేటాతో పోల్చినప్పుడు నమూనా నాణ్యతను బట్టి మెషీన్ లెర్నింగ్ మోడల్స్‌దాదాపు 60 శాతం నుంచి 78 శాతం కచ్చితత్వంతో నిస్పృహ లక్షణాలను సరిగ్గా అంచనా వేశాయని గుర్తించారు.

### వాయిస్ నోట్స్ ద్వారా...


పీఎల్‌వోఎస్ మెంటల్ హెల్త్‌లో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం బ్రెజిల్‌కు చెందిన మానసిక వైద్య పరిశోధకుడు విక్టర్ ఒటాని నేతృత్వంలోని పరిశోధకులు... డిప్రెసివ్ డిజార్డర్ లక్షణాలు ఉన్న, అవి లేని వ్యక్తులను వేరు చేయడంలో మెషీన్ లెర్నింగ్ మోడళ్లు సహాయపడతాయా అని పరీక్షించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారి నుంచి స్వల్ప వ్యవధిగల వాట్సాప్ వాయిస్ సందేశాలను రికార్డ్ చేశారు. ఆ ఆడియో క్లిప్‌ల నుంచి సేకరించిన శబ్ద లక్షణాలపై ఏడు వేర్వేరు మెషీన్ లెర్నింగ్ నమూనాలు, ప్రామాణిక క్లినికల్ ఇంటర్వ్యూలను ఉపయోగించి కుంగుబాటును నిర్ధారించారు. దీని ప్రకారం ఏఐ నమూనాలు మహిళల్లో 91.67 శాతం వరకు, పురుషులలో 80 శాతం వరకు కచ్చితత్వంతో కుంగుబాటును గుర్తించాయి.

### ఇతర ప్రపంచ అధ్యయనాలు ఏమి చెబుతున్నాయి...

ది యానల్స్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం మాటలు, స్పందనల్లోని నిరాశను గుర్తించడానికి ఏఐ--ఆధారిత వాయిస్ బయోమార్కర్ సాధనాన్ని మూల్యాంకనం చేసింది. మెషీన్ లెర్నింగ్ సాధనం 70 శాతం కంటే ఎక్కువ కేసుల్లో ఆడియో ఫైల్‌ను సమర్పించిన 25 సెకన్లలోనే మోస్తరు నుంచి తీవ్ర నిరాశలో ఉన్న బాధితుల స్వరాలను గుర్తించింది. యూఎస్, కెనడాలోని దాదాపు 15,000 మంది వయోజనుల నుంచి సేకరించిన వాయిస్ రికార్డింగ్‌లను పరిశోధకులు విశ్లేషించి అల్గోరిథం ఇచ్చిన ఫలితాలను ప్రామాణిక డిప్రెషన్ ప్రశ్నపత్రాలతో పోల్చినప్పుడు ఈ మేరకు ఫలితాలు వచ్చాయి. అయితే ఈ విధానం క్లినికల్ డయాగ్నోసిస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు.

# వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

### జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ
### నీటి ఆధారిత మూలకాలతో తయారీ




మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్పాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసలై?పడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2--1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కొలంబిక్ ఎఫీషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్--సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# ముచ్చటైన మరో మూడు పక్షులు







### పసుపు చెంప పిట్ట , పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట , లీసెర్ విజిలింగ్ డక్ బేబీ
### శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం
### తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.

ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షిజాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

# దమ్ముంది.. దన్ను కావాలి

### ఇప్పటికైతే మనది 10వ స్థానం
### ఏఐ మేధోనిధి.. ఇండియా!
### మెరికలున్నా సదుపాయాల్లేవు
### నైపుణ్యం ఒక్కటే సరిపోదు
### సూపర్ కంప్యూటర్‌లు... భారీ పెట్టుబడులు అవసరం
### ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'



ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

### నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

### సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమంలో వ్యక్తం అవుతోంది.

### ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

### ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రైనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### ప్రపంచాన్ని శాసించగలమా?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

**హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)**
**హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)**
**హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్**
**ఎల్.ఎం.ఐ. సి. : లోయర్--మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.